


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 03-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 255 పేజీలు : 8 వెల : 1 రూపాయి

### స్పందన కార్యక్రమంపై

# ఆకస్మిక తనిఖీ చేస్తా



**ప్రజా సమస్యలను పరిష్కరించాలి**

**కలెక్టర్లు, ఎస్పీలు వీటిని పర్యవేక్షించాలి**

**రశీదులు ఇవ్వాలి.. జాప్యం చేయవద్దు**

**సీఎం వైఎస్ జగన్**

అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం సమీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజల నుంచి వస్తున్న వినతి పత్రాలకు రశీదులు ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి అధికారులకు తరువాయి 2లో..

### పార్టీ పేరు చెప్పి దురుసుగా ప్రవర్తిస్తే

# ఎవ్వరినీ ఉపేక్షించం

- ఆకాశ్ విజయ్ వర్గియాపై మోదీ ఆగ్రహం
- వారణాసి నుంచి భాజపా సభ్యత్వ నమోదు
- ప్రతీ పోలింగ్ కేంద్రంలో 5 మొక్కలు నాటాలి

దిల్లీ: మున్సిపల్ అధికారులపై భాజపా ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్ వర్గియా దాడి ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన భాజపా పార్లమెంటరీ భేటీలో ఈ విషయం గురించి ప్రస్తావించిన ఆయన పార్టీ ఎంపీలకు గట్టి హెచ్చరికలు చేసినట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. పార్టీకి చెడ్డపేరు తెచ్చేవారు ఎవరైనా సరే సహించేది లేదని మోదీ స్పష్టం చేశారట.

పార్టీ పేరును దెబ్బతీసే నేతలు మనకొద్దు. ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కాదు. ఎవరి కుమారుడైనా సరే, బంధువైనా సరే అలాంటి తరువాయి 2లో..



## కార్యకర్తలకు రక్షణగా ఉంటా

**ఆ బాధ్యత నాది**

**ఏడుసార్లు నన్ను గెలిపించారు**

**కుప్పం పర్యటనలో చంద్రబాబు**

కుప్పం: తెదేపా కార్యకర్తలపై వైకాపా దాడులు పెరిగిపోయాయని.. కార్యకర్తల్ని కాపాడుకునే బాధ్యత తనపై ఉందని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరువాయి 2లో..



## అమెరికా, ఏపీ మధ్య సత్సంబంధాలు కొనసాగాలి




వార్త 2వ పేజీలో..

## జమ్ముకశ్మీర్ భారత్‌లో భాగమే

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్ భారత్‌లో భాగమని, దాన్ని దేశం నుంచి ఎవ్వరూ విడదీయలేరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. మంగళవారం జమ్మకశ్మీర్ పరిస్థితుల గురించి రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.... ఆర్టికల్ 356ను గత కాంగ్రెస్ సర్కారు దుర్వినియోగం చేసింది. మా ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉంది. భారత్‌ను విభజించాలని చూసే వారికి మేము వారి భాషలోనే సమాధానం చెబుతాం. దేశంలోని ప్రతి పౌరుడిని రక్షించుకోవడంపై నిబద్ధతతో ఉన్నాం. ఎన్నికల కమిషన్ నుంచి తరువాయి 2లో..



## విజయవాడలో తొలి ఆధార్ సేవా కేంద్రం

న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరికల్లా దేశ వ్యాప్తంగా సొంతంగా 114 ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభించాలని ప్రణాళికలు వేసుకున్న భారత విశిష్ట సంఖ్య ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఇందులో భాగంగా తాజాగా దిల్లీ, విజయవాడల్లో ఆ కేంద్రాలను ప్రారంభించిందని మంగళవారం సంబంధిత అధికారులు మీడియాకు తెలిపారు. ఆధార్ నమోదు, మార్పులు వంటి సేవలను ఈ కేంద్రాలు అందిస్తాయని చెప్పారు. ఇప్పటికే బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు, ఇతర కేంద్రాల్లో ప్రజలు ఈ సేవలను ఇతరుల ద్వారా అందుకుంటున్నారు. త్వరలోనే నేరుగా యూఐడీఏఐ సొంత కేంద్రాల్లో దేశంలోని 53 నగరాల్లోని 114 ప్రాంతాల్లో ఈ సేవలు అందించే ప్రయత్నం చేస్తున్నారు. మొదటి కేంద్రాలు దిల్లీ, విజయవాడలో ప్రయోగాత్మకంగా ప్రారంభమయ్యాయి.

దిల్లీలోని అక్షర్‌ధామ్ తరువాయి 2లో..




### రైతులకు ఎటువంటి లోటు రాకుండా నాణ్యమైన

## విత్తనాలు, ఎరువులు అందించాలి

- నీటి ఎద్దడి లేకుండా మంచినీటి పథకాలను అమలు చేయాలి
- రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : జిల్లాలో విత్తనాలకు, ఎరువులకు ఎటువంటి లోటు రాకుండా రైతులకు అందించాలని, ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని రైతుల సంక్షేమమే ధ్యేయంగా వారికి అన్ని రకాల పథకాలను అమలు చేస్తున్నదన్నారు. వై ఎస్ ఆర్ రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి రూ. 1200/- ను అందించనున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ కు సంబందించి జిల్లాకు అవసరమైన ఆర్ జి ఎల్ 2537 రకం వరి వంగడాలు పదివేల క్వింటాళ్లు అవసరంకాగా ఏడు వేల క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేసారని, మిగిలిన అవసరమైన విత్తనాలు కూడా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ కు మంత్రి ఆదేశించారు. కల్తీ తరువాయి 2లో..

### ప్రభుత్వ రంగ సంస్థలకు పాతర..

# ఇదేం నిర్వాకం?

**రాయబరేలి ఎంపీ సోనియాగాంధీ**



న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, రాయబరేలి ఎంపీ సోనియాగాంధీ తూర్పారబట్టారు. కొందమంది పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరుస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలకు కూడా ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. 17వ లోక్‌సభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం లోక్‌సభలో సోనియాగాంధీ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలను (పీఎస్‌యూ) నవీన భారత దేవాలయాలు (టెంపుల్స్ ఆఫ్ మోడ్రన్ ఇండియా)గా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించేవారని, ఇప్పుడు ఆ దేవాలయాలు చాలామటుకు ప్రమాదంలో పడటం చాలా బాధ కలిగిస్తోందని అన్నారు.

లాభాలు ఉన్నా ఉద్యోగులకు సకాలంలో తరువాయి 2లో..

## భారీ వర్షాలతో ముంబయి విలవిల



ముంబయి: భారీ వర్షాలు దేశ వాణిజ్య రాజధాని ముంబయిని అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నగరంలో జనజీవనం అస్తవ్యస్థమైంది. ఎక్కడి కక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రవాణా వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది. రైల్వేట్రాక్‌ల పైకి వర్షపు నీరు చేరడంతో పలు రైళ్లు రద్దు కాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. తరువాయి 2లో..



# భూగర్భ డ్రైనేజీ ఎక్కడ? రూ.10 కోట్ల నిధులు ఏమయ్యాయి?

## కుళ్లునీరు రోడ్లపై ప్రవహిస్తుంది...



సబ్బవరం : గత ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం చేపట్టిన హడావిడి శంకుస్థాపనలు గాలిలో కలిసి పోయాయని ప్రజలు అంటున్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హడావిడిగా అసకపల్లి దగ్గర సుజలస్రవంతి ప్రాజెక్టు, సబ్బవరంలో రూ.10కోట్ల నిధులతో భూగర్భ డ్రైనేజీ శంకుస్థాపన చేసారు. ఇది కేవలం ఎన్నికలు ప్రచారానికే పరిమిత మయ్యిందని, శుష్క వాగ్ధానాలతో తమ పబ్బము గడుపుకున్నారని ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. మూడు నెలల్లో భూగర్భ డ్రైనేజీ పూర్తి చేస్తామని అప్పటి ఎమ్మెల్యే ప్రగల్భంగా చెప్పుకున్నారు. కానీ ఆ హామీ నెరవేర్చ లేకపోయారు.డ్రైనేజీలు లేక సబ్బవరం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారిపై కుళ్లు నీరు ప్రవహిస్తున్నా పంచాయితీ అధికార్లు కూడా పట్టించుకోలేదని, చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపి స్తున్నారు. సాయి నగర్ నుండి మరీ దారుణంగా ఇళ్లలో వాడుకునే నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఈ కుళ్లు నీరు రోడ్లపై ప్రవహిస్తుంటే అటుగా వెళ్లే వాహన చోదకులు వారి బట్టలపై పడుతుందని వాహన చోద కులు వాపోతున్నారు.

మండల కేంద్రంలో కూడా ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. చెత్తా చెదారాన్ని అయినా తొలగించాలని ప్రజలు అంటున్నారు.

గత టిడిపి ప్రభుత్వం చేయలేకపోయినా కొత్తప్రభుత్వం అయినా ఈ దుర్గంధం నుండి విముక్తి చేస్తుందేమో వేచి చూద్దాం అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

## జె.ఎన్.ఆర్.ఎంకాలనీ, స్వచ్ఛభారత్‌నగర్‌లో ముత్తంశెట్టి పర్యటన



భీమునిపట్నం : బోయపాలెం జె.ఎన్.ఆర్.ఎం కాలనీ, స్వచ్ఛ భారత్ నగర్ లో బుధవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు యువ జన సంక్షేమ శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు పర్య టించి అక్కడ ఉన్న స్థానిక సమస్య లను ప్రజలని అడిగి తెలుసుకున్నారు. జె.ఎన్.ఆర్.ఎం కాలనీ మొత్తం అంతా కూడా శానిటేషన్ సమస్య మరియు ఆ ప్రాంతాన్ని మెరుగుపరచాలని ఆయన అది కారులను ఆదేశించారు.

## అనాథ పిల్లలకు అల్పాహారం పంపిణీ



భీమునిపట్నం : స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ రాష్ట్ర అధ్యక్షులు రాజేటి బసవ కృష్ణ మూర్తి గొల్లల తాల్లవలస గల మన కుటుంబం చైల్డ్ హోమ్ లో అనాధపిల్లల మధ్య ఘనంగా జ రిగింది . ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి అక్కడి పిల్లలకు తిని పించారు. అనంతరం ఆ పిల్లలకు అల్పాహా రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు సేవ చేయడంలో మానసిక ఆనందం వస్తుందనీ అన్నారు. పిల్ల లతో ఉంటే వాళ్లకు తనవారు తమతో ఉన్న భావన వాళ్ళకు కలుగుతుం దని చెప్పారు. మన కుటుంబం హోమ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## శ్రీజగన్నాథస్వామివారి నేత్రోత్సవం



విజయనగరం : స్థానిక దాసన్నపేటలోని శ్రీజగన్నాధస్వామివారి ఆలయంలో రధయాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నేత్రోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పి.వెంకట రమణాచార్యులు ఉదయంసేవాకాలం, క్షీర, జలాది వాసములు నిర్వహించారు. తితిదే ద్రవిడ వేదపండితులు జివివి జగన్నాధాచార్య వేదపారాయణ, శయ్యాదినం, జరిగాయి. ఈనల 4వ తేదీన రధయాత్ర, 12న మారురధయాత్ర కార్యక్రమాలు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇ.ఓ, స్వామివారి సేవాసమితి సంయుక్త నిర్వహణలో జరుగుతాయి.

## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

అచ్యుతాపురం : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మండల సిఐటియు కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేశారు .మంగళవారం ఆయన ఆశ వర్కర్లతో కలిసి పీహెచ్ సి ల వద్ద నిరసన తెలియజేసి వైద్యాధికారిణికి వినతిపత్రం అందజేశారు .2019 సం . జనవరి నుండి గౌరవేతనం ,పారితోషక బకాయిలు చెల్లించాలన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన 10 వేలు వేతనాన్ని పారితోషకాలు తో ముడిపెట్టకుండా చెల్లించాలన్నారు .

### రైతులకు ఎటువంటి లోటు రాకుండా నాణ్యమైన

# విత్తనాలు, ఎరువులు అందించాలి

**మొదటి పేజీ తరువాయి**



విత్తనాలు లేకుండా నాణ్యమైన విత్తనాలు మరియు ఎరువులను రైతులకు అందించాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా నూతన ఆలోచనలతో ఆధునిక యంత్రాలను ఉపయోగించి ఎక్కువ దిగుబడి వచ్చి గిట్టుబాటు ధరలు లభించే విదంగా రైతులకు అవగాహన కల్గించాలన్నారు. సముద్రం, నదులు ఉన్నప్పటికి చాలా గ్రామాలలో త్రాగునీటి, సాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం వెయ్యి కోట్లతో డి పి ఆర్ తయారు చేసి దశల వారీగా పథకాలు అమలయ్యే విదంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మెరక మండలాలు చోడవరం, మాడుగుల, భీమిలి, నర్సీపట్నం తదితర గ్రామాలలో నీటి సమస్య ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా చోడవరంలో 80 హెబిటేషన్లలలో వాటర్ స్కీమ్ లేవని చేతి పంపులను మాత్రమే అక్కడ ప్రజలు వాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆయా మండలాలలో రిజర్వాయర్ల ఆధునీకరణ, చెరువుల పూడిక తీత ద్వారా రైతులకు సాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని, స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణాలకు సంబందించి కార్యాచరణ ప్రణాళికను తయారు చేసి నివేదికను ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికై కేంద్రప్రభుత్వం, వరల్డ్ బ్యాంకులతో సంప్రదించి దశల వారీగా నిధులు మంజూరైయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ , శాసన సభ్యులు కన్నబాబురాజు, కరణం దర్మశ్రీ, గుడివాడ అమర్ నాద్ , తిప్పల నాగిరెడ్డి , జెసి 2 ఎం . వెంకటేశ్వరరావు, జెడి వ్యవసాయశాఖ మల్లికార్జునరావు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ ఇ రవికుమార్, వ్యవసాయ మరియు ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు పాల్గొన్నారు.

**ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు**

విప్లవ వీరుడు, మన్యం పులి అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఈ నెల 4వ తేదిన పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలోను, కే డి పేట లోను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ జయంతి వేడుకల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ 10 లక్షలను మంజూరు చేస్తారన్నారు.

## మంత్రిని కలిసిన ఎ పి ఇపిడిసిఎల్ సి ఎం డి నాగలక్ష్మి సెల్వరాజ్



ఎ పి ఇపిడిసిఎల్ సి ఎం డి గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి సెల్వరాజ్ రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో విద్యుత్తు సమస్యలు, నిరంతర విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై చర్చించారు. సంచార మలేరియా, డెంగ్యూ అవగాహన వాహనాలను ప్రారంభించిన మంత్రి పట్టణ ప్రాంతంలో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాదులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతున్నందున వాటిని నియంత్రించడానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు జి.వి.ఎం సి ఏర్పాటు చేసిన అవగాహన వాహనాలను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ తో కలిసి ప్రభుత్వ అతిధి గృహం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. శాసన సభ్యులు కన్నబాబు రాజు, కరణం దర్మశ్రీ, గుడివాడ అమర్ నాద్ , తిప్పల నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. తిరుపతిరావు, సి ఎం ఓ డా. హేమంత్, జిల్లా మలేరియా అధికారి తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## స్పందన కార్యక్రమంపై ఆకస్మిక తనిఖీ చేస్తా

సూచించారు. ప్రజా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కారించాలని ఆదేశించారు. అర్జీదారులకు ఇచ్చే రశీదుల మీదే సమస్యలు ఫలానా తేదీలోగా పరిష్కారిస్తామని రాసి ఇవ్వాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే రశీదులను కంప్యూటరైజ్ చేసి డేటాబేస్‌లో ఉంచాలని ఆదేశించారు. చెప్పిన వ్యవధిలోగా అధికారులు సమస్యలు పరిష్కారిస్తున్నారో లేదో క్రాస్ చెక్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్లు, ఎస్పీలు వీటిని పర్యవేక్షిస్తూ.. ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. తాను కూడా ఆకస్మిక తనిఖీలు చేపడతానని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా స్పందన కార్యక్రమం ఎలా జరుగుతుందో పరిశీలిస్తానని తెలిపారు. ప్రతి మంగళవారం అరగంట పాటు కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పందన కార్యక్రమంపై రివ్యూ చేపట్టనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. కాగా, వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన స్పందన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. అన్ని జిలాల్ల నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక సంఖ్యలో వినతులు వెల్లువెత్తాయి.

## పార్టీ పేరు చెప్పి దురుసుగా ప్రవర్తిస్తే ఎవ్వరినీ ఉపేక్షించం

వారిని పార్టీ నుంచి తొలగించాలి. వారికి మద్దతిచ్చే వారిని కూడా తొలగించాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. పార్టీ పేరు చెప్పి దురుసుగా ప్రవర్తించే హక్కు ఎవరికీ లేదు అని మోదీ ఆకాశ్‌ను ఉద్దేశిస్తూ అన్నట్లు సమాచారం. భాజపా జనరల్ సెక్రటరీ కైలాశ్ విజయ్ వర్గియా కుమారుడే ఆకాశ్. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్-3 నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆకాశ్.. ఇటీవల మున్సిపల్ అధికారులపై క్రికెట్ బ్యాట్‌తో విరుచుకుపడ్డ విషయం తెలిసిందే.

ఈ ఘటన వివాదాస్పదంగా మారడంతో పోలీసులు ఆకాశ్‌ను అరెస్టు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా, ఆకాశ్ విడుదలైన సమయంలో కొందరు పార్టీ కార్యకర్తలు ఆయనకు భారీగా స్వాగతం పలకడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలపై తొలిసారిగా స్పందించిన మోదీ.. ఆకాశ్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదని ఈ సందర్భంగా గట్టిగా చెప్పారు.

వారణాసి నుంచి భాజపా సభ్యత్వ నమోదు

జులై 6న తన సొంత నియోజకవర్గమైన వారణాసి నుంచి భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు పార్లమెంటరీ పార్టీ భేటీలో నిర్ణయించారు. భాజపా సిద్ధాంతకర్త శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మోదీ ప్రారంభించనున్నారు. అదే రోజున పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా తెలంగాణలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదలుపెట్టనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఐదు మొక్కలు నాటాలని మోదీ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## కార్యకర్తలకు రక్షణగా ఉంటా

అన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులకు ఏ మాత్రం స్థానంలేదని చెప్పారు. చిత్తూరు జిల్లా రామకుప్పంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కర్ణాటక - ఆంధ్రా సరిహద్దు వద్ద ఆయనకు తెదేపా నేతలు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రామకుప్పం కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ.. కుప్పం నియోజకవర్గంలో నన్ను గెలిపించినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు. గత 30 ఏళ్లుగా నా పట్ల మీ ఆప్యాయత చూస్తున్నా. ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా మీ ఇంట్లో బిడ్డగా నన్ను ఆదరించారు. నా జీవితాంతం మీకు రుణపడి ఉంటా. ఎమ్మెల్యేగా, సీఎంగా మీ గౌరవాన్ని పెంచేందుకే నేను పనిచేశా అన్నారు.

## జమ్ముకశ్మీర్ భారత్‌లో భాగమే

ప్రకటన వస్తే జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయబోం అని తెలిపారు. వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించే తీరు కనబడినందుకే పీడీపీతో స్నేహాన్ని తెంచుకున్నాం. జమ్ముకశ్మీర్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించే పరిస్థితులు కనపడలేదు... ఎందుకంటే అభ్యర్థులందరికీ భద్రత కల్పించడం సాధ్యం కాదు. ఈ రెండు ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే వారికి భద్రత ఇవ్వలేమని భద్రతా ఏజెన్సీలు చెప్పాయి. జమ్ముకశ్మీర్‌లో పరిస్థితులకు నెహ్రూయే కారణం. నెహ్రూ తీరుపై ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశం మాకు లేదు. కానీ, చరిత్రాత్మక తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

## ప్రభుత్వ రంగ సంస్థలకు పాతర..

వేతనాలు అందడం లేదని, కొంత మంది పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చడం కోసం ఉద్యోగులను చిక్కుల్లో నెడుతున్నారని సోనియా ఆరోపించారు. ప్రభుత్వరంగ టెలికాం కంపెనీల పరిస్థితిని ఆమె వివరిస్తూ 'హెచ్‌ఏఎల్, బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్ విషయంలో ఏమి జరిగిందో అందరికీ తెలుసు. రాయబరేలిలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీని, ఇతర పీఎస్‌యూలను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. తద్వారా కార్మికులను, వారి కుటుంబాలను గౌరవించాలి' అని ప్రభుత్వానికి ఆమె హితవు పలికారు.

ఒక ప్రముఖ వార్తా పత్రిక కథనం ప్రకారం, ప్రభుత్వ రంగ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ బీఎస్‌ఎన్‌ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) 54,000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంది. ఆర్థిక ఇబ్బందుల పేరుతో సుమారు 1.76 లక్షల మంది ఉద్యోగులకు ఫిబ్రవరి నెల వేతనం ఇంకా ఇవ్వలేదు.

## భారీ వర్షాలతో ముంబయి విలవిల

రంగంలోకి దిగిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు వర్షపు నీరు రైల్వే ట్రాక్‌పైకి వచ్చి చేరడంతో సబర్బన్ సహా ఇతర రైళ్లు ట్రాక్‌పైనే నిలిచిపోయాయి. భారీ వర్షాలతో ముంబయి నగరం తల్లడిల్లుతున్న నేపథ్యంలో మూగజీవాలకు ఆశ్రయం కల్పించాలని నటి ఈశా గుప్తా ట్విటర్ ద్వారా తెలిపారు. మనుషులు తమను తాము సంరక్షించుకోగలరని, అవకాశం ఉన్నవారు నోరు లేని మూగజీవాలకు ఆశ్రయం కల్పించాలని ఆమె కోరారు. వర్షపు నీటితో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. పరిస్థితిని పునరుద్ధరించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది పనులను కొనసాగిస్తున్నారు. వర్షపు నీటితో నగరంలోని ఓ బస్టాప్ జలమయం కావడంతో ఆ షెల్టర్ కింద ఆశ్రయం పొందుతున్న ప్రయాణికులు, వర్షపునీటిలో ఆడుకుంటున్న చిన్నారులు వర్షాల కారణంగా ముంబయి రన్‌వే పై ల్యాండ్ అవుతున్న స్పైస్‌జెట్‌కు చెందిన విమానం అదుపుతప్పింది. ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఈ సంఘటన జరిగిన వెంటనే అధికారులు ప్రధాన రన్‌వేను మూసివేసి ప్రత్యామ్నాయంగా మరో రన్‌వే పై విమానాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. భారీ వర్షాలతో నగరంలోని రైల్వేట్రాక్‌లపై వర్షపు నీరు చేరడంతో పలు రైళ్లు నిలిచిపోయాయి. ట్రాక్‌పై చేరిన వర్షపు నీటిలోనే ప్రయాణికులు నడవాల్సి వస్తోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## విజయవాడలో తొలి ఆధార్ సేవా కేంద్రం

మెట్రో స్టేషన్ సమీపంలో యూఐడీఏఐ సొంతంగా ప్రారంభించిన ఆధార్ సేవా కేంద్రంలో ఒకే రోజులో దాదాపు 1,000 మంది వాటి ద్వారా సేవలు అందుకోవచ్చు. మంగళవారం, పబ్లిక్ హాలీడేల్లో తప్ప మిగతా అన్ని రోజుల్లో ఈ కేంద్రాలు పనిచేస్తాయి. విజయవాడలో ప్రారంభించిన కేంద్రంలో రోజుకి 500 మంది సేవలు అందుకోవచ్చు. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల మధ్య ఖర్చు అవుతుందని అంచనా. పాస్ పోర్టు సేవా కేంద్రాల మాదిరిగా వీటి సేవలను అందించాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఇతర సంస్థల ద్వారా కొనసాగిస్తున్న ఈ సేవల కంటే.. యూఐడీఏఐ ప్రారంభిస్తున్న ఆధార్ సేవా కేంద్రాలు మెరుగైన సేవలు అందించగలిగే సామర్థ్యం ఉంటుంది.. ఒకే రోజులో వందల మంది ప్రయోజనాలు పొందొచ్చు. అలాగే, ప్రజలు ఆ కేంద్రాలకు వెళ్లడానికి కొన్ని రోజుల ముందే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. తమకు వీలైన సమయంలోనే వెళ్లి సేవలను పొందొచ్చు.

## అమెరికా, ఏపీ మధ్య సత్సంబంధాలు కొనసాగాలి

### జగన్‌ను కలిసిన అమెరికా కాన్సూల్ జనరల్

అమరావతి: అమెరికా కాన్సూల్ జనరల్ క్యాథరీన్ బీ హడ్డా మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అమరావతిలోని సచివాలయంలో వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇరువురు చర్చించుకున్నట్టు తెలుస్తోంది.

లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సూల్ జనరల్ కాథరీన్ హడ్డా ట్విటర్‌లో అభినందనలు తెలిపిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించిన వైఎస్ జగన్‌కు అభినందనలు. భవిష్యత్తులో అమెరికా, ఆంధ్రప్రదేశ్ మధ్య మంచి సంబంధాలు కొనసాగాలని ఆశిస్తున్నా అని ఆమె ట్వీట్ చేశారు. గతంలో వైఎస్ జగన్‌తో దిగిన ఫోటోను ఆమె ట్విటర్‌లో ఈ సందర్భంగా షేర్ చేశారు.

# నర్సీపట్నం రోటరీ క్లబ్‌కు ఏడు అవార్డులు



నర్సీపట్నం: జూన్ 30 ఆదివారం విశాఖపట్నంలో జరిగిన రోటరీ డిస్ట్రిక్ట్ 3020 అవార్డుల వేడుకలో నర్సీపట్నం రోటరీ క్లబ్‌కు వివిధ రంగాలలో ఏడు అవార్డులు లభించాయి. బెస్ట్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రెటరీ, బెస్ట్ ఇన్స్పిరేషనల్ క్లబ్, బెస్ట్ పోలియో ఫండ్ అవార్డు, పబ్లిక్ ఇమేజ్ మొదలైనవి లభించాయి. ఈ సంవత్సరం పెదబడ్డేపల్లి ఉన్నత పాఠశాలకు రూ.5లక్షల విలువైన టాయిలెట్స్, స్టేజ్ నిర్మించారు. మాకవరపాలెంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహిం చారు. మూడుసార్లు బ్లడ్ బ్యాం కులు నిర్వహించి సుమారు 200 యూనిట్లు రోటరీ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. వృద్ధాశ్రమానికి 40 కుర్చీలు, కిరాణా సామాగ్రి, పరు పులు అందజేశారు. కేరళ వరద సహాయనిధికి లక్ష రూపాయలు, పోలియో ఫండ్ కు 120000, నర్సీ పట్నం మెయిన్ స్కూలుకు రూ.30000 విలువ గల మైక్ సిస్టమ్, వికలాం గులకు 3లక్షల విలువైన 60 వీల్ చైర్లు, మరిన్ని సేవా కార్యక్ర మాలు నిర్వహించారు.

ఈ కార్యక్ర మంలో క్లబ్ ప్రెసిడెంట్ సుతాపల్లి శ్రీకాంత్, సెక్ర టరీ పచ్చిగోళ్ళ నారాయణరావు, రీజనల్ చైర్మన్ భేతిరెడ్డి విజయ్ కుమార్, ఇతరులు అవార్డులను అందుకున్నారు.

# ఈ నెల 8కి పింఛన్లు పంపిణీ మార్పు

రోలుగుంట: ఈ నెల 1 నుంచి బట్వాడా చేయాల్సిన పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని 8వ తేదీ దివంగత ముఖ్యమంత్రి వైయస్.రాజశేఖరరెడ్డి జన్మదినం రోజుకు మార్చడం జరిగిందని రోలుగుంట ఎంపిడిఒ గౌరీశంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు నుంచే వైయస్సార్ పింఛన్ కానుక పథకం కింద పెంచిన పైకం అనగా రూ.2250, రూ.3000, రూ.10వేలును జులై 8 వైయస్సార్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పింఛను బట్వాడా, సమావేశం ఏర్పాటు చేసి చెల్లించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఈ విషయాన్ని పింఛన్‌దారులు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

# ఇకపై ఇంటింటికి గ్యాస్ సరఫరా

మాకవరపాలెం: హెచ్‌పి గ్యాస్ వినియోగదారులకు సిలెండర్లను డోర్ డెలివరీ చేస్తున్నామని డీలర్ విద్యాసాగర్ తెలిపారు. మండల కేంద్రంలో ప్రతీ సోమ, శనివారాల్లో గ్యాస్ పంపిణీ జరుగుతుందని, ఈ రెండు రోజులు వినియోగదారులకు డోర్ డెలివరీ చేస్తామన్నారు. అలాగే సాయంత్రం వేళల్లో పంచాయతీ కార్యాలయం వద్ద గ్యాస్ పంపిణీ యధావిధిగా జరుగుతుందన్నారు. మండల కేంద్రంలోని వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరుతున్నారు.

# తెలుగు జాతి మహనీయులను మరిచిపోతున్నాం



డాబాగార్డెన్స్ : దేశ స్వాతంత్రానికి పాటుపడిన, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణ త్యాగం చేసిన తెలుగు జాతి మహనీయులను ప్రస్తుత సమాజం మర్చి పోతుందని సమైక్య భారతి సాంస్క ృతిక సామాజిక చైతన్య సంస్థ జాతీయ కన్వీనర్ కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల నాలుగవ తేదీన అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను నిర్వహించే కార్యక్రమ వివరాలు తెలుపుతూ మంగళవారం వీజేఎఫ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామ రాజు కన్నెగంటి హనుమంతు పొట్టి శ్రీరాములు వంటి తెలుగు జాతి మహనీయుల కీర్తిని ప్రస్తుత భావి తరాలకు తెలపవలసిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పాలకులు అతి మహనీయులను మరిచి పోవడం దారుణమన్నారు. సమైక్య భారతి ఉపాధ్యక్షురాలు శ్రీమతి జయప్రద శర్మ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించు కుని పౌర గ్రంథాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కవులు కళాకారులు సాహితీ వేత్తలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో సహాయ కార్యదర్శి సత్యనారాయణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వానపల్లి వేణుగోపాల్ రావు, పార్వతి పాల్గొన్నారు

# తల్లిపాల ప్రాముఖ్యతను వివరించాలి



నాతవరం: తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరిం చాలని డిప్యూటి డిఎంఅండ్‌హెచ్‌ఒ జె.ప్రశాంతి సూచించారు. మంగళ వారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆశ వర్కర్లతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామాల్లో తల్లిపాల ప్రాధాన్యతపై తల్లులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం ద్వారా ఆ బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. జులై నెల నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు విస్తారంగా పడతాయని, వర్షాల వల్ల నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. జులై, ఆగస్టు నెలలో కాచిచల్లార్చిన నీటిని తాగడం వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని, ఈవిషయాన్ని ఆశ వర్కర్లు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ప్రసన్న, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.

# పీర్ లీడర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

యలమంచిలి రూరల్: పీర్ లీడర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఈ.రాజశేఖర్ అన్నారు. ఏయూలోని మూడు రోజుల పాటు నిర్వహించిన పీర్ లీడర్ శిక్షణకు తమ కళాశాల విద్యార్థులు హాజరయ్యారన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులను స్థానిక కళాశాలలో అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ఎన్నో విషయాలను విద్యార్థులు తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ వి.రాజశేఖర్, డాక్టర్ ఎవి.రమేష్, డాక్టర్ బి.లక్ష్మి పాల్గొన్నారు.

# హిందుస్థాన్ పెట్రోలియం వారి స్వచ్ఛతా పక్షోత్సవాలు



ఆరిలోవ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారిచే నడుపబడుతున్న ఆరిలోవలోని స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ లో జూలై 1 నుండి 15 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ సి.వి.నర సింహ దాసు ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్థకు చెందిన 10 కేంద్రాలలో మొదటిరోజున 1400 మంది విద్యార్థులచే స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. రెండవ రోజు వివిధ ప్రాంతాలలో స్వచ్ఛతా ర్యాలీలు నిర్వహించారు. ఇక రాబోయే 13 రోజులలో అన్ని వర్గాలవారినీ అకట్టుకుని, ఆలోచింపజేసి, అవలంభించే విధంగా విభిన్నమైన అవగాహనా కార్యక్రమాలు చేబడుతున్నట్లు, వీటిలో ప్రధానంగా ఆధునిక శాస్త్ర సాంకేతికతను ఉపయోగించు కుంటూ యువత పాల్గొనేలా సెల్ఫీ, వీడియో, ఫోటో, లఘు చిత్రాల పోటీలు, వీధి నాటకాలు, చిత్రలేఖనం, మాక్ డ్రిల్లులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల వారికి చేరేలా రూపొందించినట్లు తెలిపి, అందరూ పాల్గొనాలని కోరారు. ముందుగా సెల్ఫీ మరియు వీడియో పోటీల బ్రోచర్ ను విడుదల చేశారు. నిబంధనలననుసరించి అందరూ పాల్గొన వచ్చును

# డ్వాక్రా సంఘాలకు రుణమాఫీకి కసరత్తు

రావికమతం: వైయస్సార్ ఆసరా పథకంలో భాగంగా మండలంలో 1,112 డ్వాక్రా సంఘాలకు రూ.36 కోట్ల 34లక్షల 87ల రుణమాఫీకి మొదటి విడతగా బ్యాంకులు ధృవీకరించాయని ఏపిఎం పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 1,763 ఎస్‌హెచ్‌ఒ గ్రూపులకు గాను వివిధ కారణాల వల్ల 267 సంఘాల రుణమాఫీకి అర్హత సాధించలేకపోయాయని అన్నారు. మొదటి విడతగా 1112 సంఘాలకు సంబంధించి ఏప్రిల్ 11నాటికి బ్యాంకుల రుణ బకాయిలను బ్యాంకుల నుంచి సేకరించామన్నారు. ఈ మేరకు వ్యక్తిగతంగా ఒక్కో సంఘం అప్పు వివరాలు దరఖాస్తును ఆయా సంఘ అధ్యక్షులతో ధృవీకరించి సిఎంకు పంపించినట్లు ఏపిఎం తెలిపారు.

# 13 వేల ఇళ్ల మంజూరుకు కృషి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తాం
- హౌసింగ్ అధికారుల సమీక్షా సమావేశంలో
- చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



చోడవరం: నియోజకవర్గంలోని నాలుగు మండలాలలోని 109 పంచాయతీలలో 13 వేల పై చిలుకు ఇళ్ళను మంజూరు చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు స్థానిక శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ అన్నారు. పట్టణంలోని వై.సి.పి. కార్యాల యంలో గృహ నిర్మాణశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జయరామ్, డి.ఈ, లక్ష్మణమూర్తి సిబ్బందితో కలసి మంగళవారం సమీక్షా సమేవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఇళ్ళ వివరాలపై అధికారులను ఆరాతీశారు. అనంతరం స్థానిక విలేఖరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామని ఇందుకోసం ప్రభుత్వానికి అవసరమైన నివేదికను సిద్ధం చేస్తున్నామన్నారు.చోడవరం పట్టణాని 5 వేలు, బుచ్చియ్యపేట మండలంకు 2100, రావికమతం మండలం 3500, రోలుగుంట మండలానికి 2500 ఇళ్ళను మంజూరు చేసేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేశామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఎవరైనా ప్రభుత్వం నుంచి లబ్దిపొందితే వారి ధరఖాస్తు తిరస్కరించడం జరుగుతుందన్నారు. ప్రధాన రహదారి విస్తరణలో పూర్తిగా ఇళ్ళు కోల్పోతున్న వారికి వేరే చోట స్థలం కేటాయించి ఇళ్ళు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గతంలో వై.యస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాడుగుల నియోజక వర్గంలో తన హయాంలో 15 వేల ఇళ్ళు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి హయాంలో చోడవరం నియోజకవర్గంలో ఇళ్లులేని ప్రతి పేదవారికి గృహాలు ఇవ్వడం జరుగుతుందని, అర్హత గల వారు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గత ప్రభుత్వం ఇచ్చినవి మోస పూరిత జీవోలు చోడవరం పట్టణానికి 3996 ఇళ్ళు మంజూరైనట్లు మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు మోస పూరితమైన జీవోలను చూపించి ప్రజలను మభ్యపెట్టారని ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆరోపించారు. విశాఖ అర్బన్‌కు వర్తించే స్కీమ్‌ను చోడవరంకు వర్తిస్తుందంటూ మాయమాటలు చెప్పారని విమర్శించారు. అర్హత గల ప్రతి లబ్దిదారునికి జగన్మోహన్ రెడ్డి హయాంలో సొంత ఇంటి కల నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రవి కుమార్, వై.సి.పీ నాయకులు, రిటైర్డు తహశీల్దారు పెంటకోట అప్పలనాయుడు, పల్లా నర్సింగరావు, బొడ్డేడ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇనస్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



నర్సీపట్నం: వసుధ పౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సీపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థు లకు నోటు పుస్తకాలను మాజీ ఎమ్మెల్సీ డివి. సూర్యనారాయణ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ఇటువంటి కార్యక్రమాలు చేయడం మంచి విషయమన్నారు. మరెన్ని స్వచ్ఛంధ సంస్థల పేద విద్యార్థులకు పుస్త కాలు పంపిణీ చేయడానికి ముం దుకు రావాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంఇఒ జి.సాయిశైలజ, ఉపాధ్యాయులు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్దులకు ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందచేత



చోడవరం: పట్టణంలో గల పసుమర్తి సాంబ మూర్తి, లక్ష్మీకాంతం ట్రస్ట్ ద్వారా 42 మంది పేద విద్యార్దులకు 46,500 రూపాయలు స్కాలర్ షిప్‌లను అమెరికాలో నివాసముంటున్న ఉప్పల శ్రీరామ్ మంగళవారం అందచేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారి కుమారులు పసుమర్తి హరనాద్ గుప్తా, పసుమర్తి గౌరీ శంకర కామయ్య గుప్తా తదితరుల చేతుల మీదుగా అందచేశారు.ఒకటి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్దులకు 750, ఇంటర్మీడియట్ విద్యార్దులకు 1500, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్దులకు 3వేలు చొప్పున అందచేశారు.అలాగే ట్రస్ట్ నుంచి గత 10 ఏళ్ళుగా స్కాలర్ షిప్ అందుకుని ఉద్యోగం సాధించిన పల్లపోతుల ప్రవీణ్ తన తండ్రి రమేష్ చేతుల మీదుగా 6 వేల రూపాయలను పేద విద్యార్దులకు తనవంతు సహాయంగా అందించారు. ఈ కార్యకమ్రంలో పలువురు వాసవి క్లబ్ సభ్యులు, విద్యార్దులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# బ్లేడుతో కంఠం కోసుకుని వ్యక్తి ఆత్మ హత్య

చోడవరం: చోడవరం పంచాయతీ పి.ఎస్.పేట గ్రామానికి చెందిన వ్యక్తి చూచుకొండ శంకరరావు(35)అనే వ్యక్తి బ్లేడుతో కంఠం వద్ద కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ మనస్పర్ధలతో మద్యంకు బానిసైన ఇతను సోమవారం మధ్యాహ్నం స్థానికంగా ఉన్న చెరువు వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాఛారం అందించడంతో వెంటనే అంబులెన్సు సిబ్బంది చేరుకుని హుటాహుటిన అనకాపల్లి ఎన్.టి.ఆర్. ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖలోని కె.జి.హెచ్.కు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

అతనికి భార్య ఒక కొడుకు, కుమార్తె ఉన్నారు.

చోడవరం ఎస్.ఐ, ఎస్.ఎ.మునాఫ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఆర్‌టిసి/18-19/224**

1. ఎన్‌డి(వి) వద్ద ఎమ్‌జిటి విభాగము కొరకు డబుల్ గర్డర్ ఎలక్ట్రిక్ ఓవర్ హెడ్ ట్రావెల్లింగ్ 50/10 టన్ను (ఇఓటి) క్రేను సరఫరా, ఇన్‌స్టాలేషన్, టెస్టింగు & కమీషనింగు కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 4,11,300/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.
3. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయనగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 13 జూలై 19 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0078/1920** **డిజిఎమ్ (ఆర్‌పి)**


# ఇగ్నోలో 24వ ప్రొ. జి. రాంరెడ్డి స్మారకోపన్యాసం

- ప్రతియేడూ ఇగ్నో వ్యవస్థాపకులు ప్రొ. జి. రాంరెడ్డి స్మారకోపన్యాసాల నిర్వహణ
- ఇగ్నో ప్రధానకార్యాలయంలో ముఖ్య అతిథిగా ప్రొ. డి. ఎస్. చౌహాన్
- విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో ఘనంగా జరిగింది



విశాఖ సిటీ : ఇందిరాగాంధీ జాతీయ విశ్వవిద్యాలయం (ఇగ్నో) వ్యవస్థాపక కులపతి, దూరవిద్యా విధానానికి భారతదేశంలో బాటలు వేసిన మహనీయులు, కీ.శే. ప్రొ. జి. రాంరెడ్డి స్మారకోపన్యాసం మంగళవారం ఇగ్నో ప్రధాన కార్యాలయంలోనూ, దేశ వ్యాప్తంగా ఉన్న ఇగ్నో ప్రాంతీయ కార్యాలయాలలోనూ ఘనంగా నిర్వహించారు. న్యూఢిల్లీలోని ఇగ్నో ప్రధాన కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి మథురలోని జి.ఎల్.ఏ విశ్వవిద్యాలయం కులపతి, భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం పూర్వాధ్యక్షులు ప్రొ. డి.ఎస్.చౌహాన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రొ. జి. రాంరెడ్డి స్మారకోపన్యాసం చేసారు. సుస్థిర విద్యకు తోడ్పడే దూరవిద్యా విధానం, నాణ్యత- దూరవిద్య నిబంధనలు అనే అంశంపై ఉపన్యసించిన ప్రొ.చౌహాన్ ప్రస్తుతం భారత దేశంలో దూరవిద్యావిధానానికి ఉన్న ప్రాముఖ్యతను వివరిస్తూ, పాఠశాలవిద్య పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యను అందించడం కేవలం దేశంలోని దూరవిద్యా సంస్థల తోడ్పాటుతోనే సాధ్యమవుతుందని, ఇగ్నో ఈ కార్యక్రమంలో ముఖ్య భూమిక వహిస్తుందనీ అన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన యు.జి.సి. నిబంధనలు దేశంలోని దూరవిద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాల పనితీరును గణనీయంగా మెరుగు పరుస్తాయని, నాణ్యత గల ఉన్నత విద్యను అధిక శాతం విద్యార్థులకు చేరువలోకి తెస్తాయని ఆశించారు. ఇగ్నో కులపతి ప్రొ. నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతీయ కేంద్రాలలోనూ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో ప్రాంతీయ సంచాలకులు డా. ఎస్. రాజారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ప్రొ. జి. రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలతో అలంకరించి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. డా. రాజారావు ఈ సందర్భంగా ఉద్యోగులను, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో సహాయ ప్రాంతీయ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు, ఏ.ఎల్.పి. రావు, సహాయ రిజిస్ట్రార్, ఇగ్నో ఉద్యోగులు, ఇగ్నో అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలు, ఇగ్నో విద్యార్థులు పాల్గొన్నారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఎఎంసి/18-19/048**

1. ఎన్‌డి(వి) వద్ద ఒక సంవత్సరం కాలం పాటు డబ్ల్యూఇఎ విభాగపు పిసిబి సెంటర్ యొక్క ఎటిఇ టెరాడైన్ వ్యవస్థకై వార్షిక నిర్వహణ కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా డిజిటల్‌గా సీలు చేసిన టెండర్లు కోరుచున్నారు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైటు: www.defproc.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ధరావత్తు జమ క్రింద **రూ. 96,300/-**లకై ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన డిమాండ్ డ్రాఫ్టును ఆఫ్‌లైను డాక్యుమెంటుతో జతచేసి పంపవలెను.
3. ప్రి-బిడ్డు సమావేశం: ఎమ్‌డిఎస్ విభాగము వద్ద 02 జూలై 19/1030 గం.లకు టెండర్లు వేయదలచు సంస్థలు ప్రి-బిడ్డు సమావేశానికి హాజరు కాగలరు. సమావేశమునకు హాజరు కానిచో సంస్థలు టెండరులో పాల్గొనేందుకు అనర్హులు.
4. ఆఫ్‌లైను సీలు చేసిన టెండర్లు **"ఎమ్‌వైపి"** అన్ని మార్కు చేసి నేవల్ డాకుయార్డు విశాఖపట్నం యొక్క విజయనగర్ గేటు వద్ద గల బాక్సులో వేయుటగాని లేదా ఈ కార్యాలయానికి 13 జూలై 19 (1830 గం.లు) లోపు చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0076/1920** **డిజిఎమ్ (ఆర్‌పి)**

# విజయభాను

## సంపాదకీయం

### పెరుగుతున్న విశ్వసనీయత

ప్రథమ్ సంస్థ ఏటా వెల్లడిస్తున్న విద్యాస్థితి నివేదిక క్షేత్రస్థాయి వాస్తవాలకు నిలువుటద్దంగా నిలిచింది. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెరిగిన తీరు కొంతఊరట కలిగించింది. అయితే విద్యా ప్రమాణాల విషయంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నది. పదాలు, వాక్యాలు చదువగలిగే విద్యార్థుల సంఖ్య గతంలో కన్నా మరింత తగ్గిందని యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్(అసర్) వెల్లడించింది. దేశవ్యాప్తంగా 596 జిల్లాల్లోని మూడు నుంచి పదహారేండ్ల వయసున్న ఐదు లక్షలకు పైగా విద్యార్థుల పై విద్యా ప్రమాణాల విషయంలో చేసిన అధ్యయనంలో తేలిన ఈ చేదు నిజాలు మన విద్యావ్యవస్థ దురవస్థను చాటి చెబుతున్నది. 2007తో పోలిస్తే బడిలో చేరని పిల్లల సంఖ్య మూడు శాతం తగ్గింది. కానీ విద్యా ప్రమాణాల్లో మాత్రం 2.8 శాతం పడిపోవటం దిగ్భ్రాంతికరం. అసర్ అధ్యయనం ప్రకారం- ఐదవ తరగతి విద్యార్థుల్లో రెండవ తరగతి స్థాయి పాఠ్యాంశాలు చదువగలిగే విద్యార్థులు 2016లో 47.1 శాతం ఉంటే, 2018 నాటికి అది 43.6 శాతానికి పడిపోయింది. 8వ తరగతి విద్యార్థుల్లో 76.1 శాతం నుంచి 69.5 శాతానికి పడిపోవటం ఆందోళన కలిగించేదే. మెరుగైన విద్యా ప్రమాణాలకు ఉపాధ్యాయుల నియామకమే కీలకం. కానీ దేశవ్యాప్తంగా ఉన్న 13 లక్షల పాఠశాలల్లో 10.3 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే లోపం ఎక్కడ ఉన్నదో తెలుస్తున్నది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, వారి పని విధానం కారణంగానే పల్లె నుంచి పట్టణాల దాకా ప్రాథమిక స్థాయిలో పిల్లల చదువుల కోసం తల్లిదండ్రుల ప్రైవేట్ బాట పడుతున్నారు. తాజా అసర్ అధ్యయనం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు చదువులో మెరుగైన స్థితిలో ఉండటం గమనార్హం. అసర్ రిపోర్టు వెలువడిన రెండు మూడు రోజులు దేశవ్యాప్తంగా చదువుల స్థితిగతులపై చర్చ జరుగటం, ఆ తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవటం పరిపాటి అయ్యింది. గత కొన్నేండ్లుగా ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఏటా పాఠశాల విద్యపై అధ్యయన రిపోర్టును వెలువరిస్తూ విద్యా ప్రమాణాల్లో ఉన్న దీన స్థితిని చెబుతూనే ఉన్నది. ఏడెనిమిది తరగతుల విద్యార్థులు సైతం కనీస కూడికలు, తీసివేత లెక్కలు చేయలేని దుస్థితిని చెబుతూనే ఉన్నది. అక్షరాలను గుర్తించి చదువలేని స్థితిని చూపు తూ మన చదువుల దీన హీన స్థితిని గురించి హెచ్చరిస్తూనే ఉన్నది. అయినా విద్యాప్రమాణా ల్లో గుణాత్మక మార్పుల్లో అడుగు ముందుకు పడటం లేదు. మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవటం, ఉపాధ్యాయుల కొరత తదితర అంశాల నెపంతో అసలు సమస్యను దాటవేసే ధోరణి సాగిపోతున్నది. మన దేశీయ సంప్రదాయ విద్యా క్రమాన్ని, ప్రైవేట్ విద్యాసంస్థల తీరుతెన్నులను చూస్తే, విద్యాప్రమాణాలకు మౌలిక వసతులు, సమస్యలు అసలు అవరోధాలే కావని తేటతెల్లమవుతుంది. విద్యా విషయ సమస్య అంతా చదువులు చెప్పే బోధకుల్లోని నిబద్ధతలో ఉన్నది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లటానికి ఉపాధ్యాయుల తీరు తెన్నులే కారణమని అనేక అధ్యయనాలు చెప్పాయి. పనిచేసే చోటనే ఉండకపోవటం, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపటం లాంటి చర్యలతో ప్రజలకు ప్రభుత్వ బడులపై పూర్తిగా విశ్వాసం సన్నగిల్లింది. తాజా నివేదికలో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల్లోనే కన్నా ప్రభుత్వ బడుల్లోనే విద్యాప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని తేలింది. అందరికీ విద్య లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. ప్రత్యేక కార్యాచరణలతో విద్యావ్యాప్తికి కృషిచేస్తున్నాయి. అయితే ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలంటే పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఒకే బడి విధానం అవసరమని కొఠారీ కమిషన్ సూచించింది. కామన్ స్కూల్ విధానంతోనే విద్యాప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులకు అవకాశముంటుందని విద్యావేత్తలు ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోంచే అలహాబాద్ హైకోర్టు నిర్దేశాలు గమనించదగ్గవి. ప్రభుత్వ ఖజానా నుంచి ఆర్థిక ప్రయోజనాలు పొందే ప్రతి ఒక్కరూ అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా తమ పిల్లల్ని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరించేవారు ప్రైవేట్ పాఠశాలలకు ఫీజుల రూపంలో ఎంత మొత్తం చెల్లిస్తారో, అంతే మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయాలి. ఆ మొత్తాన్ని ప్రభుత్వ బడుల్లో చేరిన పిల్లల మౌలిక అవసరాల కల్పనకు ఖర్చు చేయాలని అలహాబాద్ హైకో ర్టు సూచించటం గమనించదగ్గది. సరిగ్గా ఈ స్ఫూర్తికి అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్యతో పాటు, సంక్షేమ హాస్టళ్లన్నింటిలో మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నది.

# శిక్షణ, నైపుణ్యా అభివృద్ధే ప్రధాన ధ్యేయం

**- జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.బి.సాయిశ్రీనివాస్**



విజయనగరం: నిరుద్యోగులకు శిక్షణ, నైపుణ్య అభివృద్ధి, ఉపాధికల్పనే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ అన్నారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన నేపథ్యంలో అలయన్స్‌క్లబ్ అంతర్జాతీయ ఛైర్మన్ సముద్రాల గురుప్రసాద్, స్టూడెంట్స్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు పూడి కిరణ్‌కుమార్‌లు సాయి శ్రీనివాస్‌ని అభినందించిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 27 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఉన్నాయని, ఒక్కొక్క కేంద్రానికి 15 నుండి 20 లక్షల రూపాయల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)అవస్థాపనా సౌకర్యాలు కల్పించామని, దీనిలో భాగంగా 30 ల్యాప్‌టేప్‌లు, 30 ట్యాబ్‌లు అందచేసామని అన్నారు. ప్రతీ నెలా ఒక మెగా జాబ్‌మేళా నిర్వహించి కనీసం 200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలనేదే ప్రధాన ధ్యేయమని, గత వారంలో ఫార్మా రంగంలో మెగాజాబ్ మేళా నిర్వహించి 96 మందికి ఉద్యోగ అవకాశం కల్పించామని, జిల్లాలో ఎస్టీ విద్యార్థులకోసం మూడు యూత్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా ఐటిడిఏ పార్వతీపురం ఆధ్వర్యంలో వెదురు బొంగులతో పరికరాలు తయారీ, చిరు ధాన్యాల బిస్కెట్ల తయారీ, టైలరింగ్‌లో శిక్షణ, చింతపండు కేక్‌ల తయారీలో శిక్షణ ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, వారానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నామని, ప్రభుత్వ ఐటిఐ విజయనగరం, బొబ్బిలిలలో ఎల్ ఎం వి, ఎలక్ట్రీషియన్ విభాగాలలో 60 మందికి శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు.

# బాలల సంరక్షణ విద్యపై ప్రచారం




విశాఖపట్నం : ప్రస్తుతం బాలలపై అనునిత్యం అత్యాచారాలు, వేధింపులు జరుగుతున్న నేపథ్యంలో బాలలను అప్రమత్తం చేయుట కొరకు బాలల సంరక్షణ విద్య అనే అంశంపై ప్రచారం నిర్వహిస్తు న్నామని ధరణి సంస్థ కార్య దర్శి, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం విశాఖ పట్టణం కన్వీనర్ బి.హరివెంకటరమణ అన్నారు. ధరణి, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం, జ్ఞానాపురం లారీ పార్కింగ్ షెడ్ దరి ఎ.ఎస్.ఆర్. నగర్ (చెంచు కాలనీ) బాల బాలికలు, మహిళలకు చిత్రాల ద్వారా బాలల భద్రత అంశాలను వివరించారు. బాలల హక్కులు, పాఠశాలల్లో, అపరిచితులతో, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి తల్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించి ప్రభుత్వం ఇస్తున్న ప్రయోజనాలను పొందాలని సూచించారు. రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం ప్రకారం పిల్లలు బడి బయట ఉండరాదని సూచించారు. ఈ కార్య క్రమంలో ధరణి సంస్థ సభ్యులు పి.సత్యవతి, ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి మాడంగి నరేష్ తదితరులు పాల్గొని బాలల, మహిళల భద్రత అంశాలను, విద్య అవశ్యకతను వివరించారు.

# ఎంపీగా గెలిచిన మరవని సేవ



అనకాపల్లి : భార్య అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలిగా గెలిచిన ఆయన మాత్రం సేవా కార్యక్రమాలను విడిచిపెట్టలేదు. ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తించాలనే ధ్యేయంతో ఆయనలో కనిపించింది. ఆయనే డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి. గడచిన ఎన్నికలలో అనకాపల్లి పార్లమెంట్ నియోజవర్గం ఎంపీగా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నుండి ఆయన భార్య సత్యవతి ఘనవిజయం సాదించారు. అయినప్పటికీ ఆయన ఎప్పటిలాగే సేవా కార్యక్రమాలకు పూనుకున్నారు. సోమవారం పాఠశాల విద్యార్దులకు చెవి, ముక్కు, గొంతు వైద్య సేవలు అందించారు. అంతే కాకుండా ఆయన కుమారుడు డాక్టర్ యశ్వంత్‌ను కూడా ఇందులో భాగం చేసారు. వందలాది మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసారు. పదవులు అలంకారం కాదని, వైద్య సేవకు పదవులు అడ్డంకి కాదని, నిరూపించారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ 15 ఏళ్ల కిందట స్దాపించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ డాక్టర్ సత్యవతి దంపతులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. అందుకే ఆమెను ఎంపీ పదవి వరించింది. ఆమె ఎంపీగా బాధ్యతలు చేపట్టినా భర్త కుమారుడితో ఉచిత సేవా కార్యక్రమాలు చేయించడం అందరినీ ఆకట్టుకుంది. ఏది ఏమైనా డాక్టర్ విష్ణుమూర్తి సాదా సిదాగా సేవలందించడం విశేషం అనక తప్పదు.

# మాజీ ఎమ్మెల్యే తనయుడు ఎంపీటీసీ శ్రీనుకు సన్మానం



పరవాడ : పరవాడ మండలములో గల ఎంపిటిసిలు, జడ్పిటిసిలు పదవీకాలం ముగియడంతో సోమవారము సన్మానకార్యక్రమం నిర్వహించారు.దీంట్లో బాగంగా పరవాడమాజీ ఎమ్మెల్యే తనయుడు, వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు, పరవాడఎంపిటిసి సభ్యులైన పైల శ్రీనువాసు రావుకి స్దానికఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతులు మీదగా సన్మానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధరావు మరియుమండలములో గల ఎంపిటిసిలుమాజీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### 'ప్రజాస్వామ్యం పంచలపాలు'

ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం ఎక్కడున్నాది, ఎక్కడున్నది?
దోపిడిదారుల చేతుల్లో దోబూచులాడుతున్న ప్రజాస్వామ్యం
ఎవడు మెచ్చిన ప్రజాస్వామ్యం, ఎవడు నచ్చిన ప్రజాస్వామ్యం
ఓటు లేని వాళ్లతో ఓటర్ల లిస్టులు
ఓటు లేని వాళ్ళు ఓట్లు వేస్తుంటే
ఓట్ల పథకం, నోట్లకమ్ముడుపోతే
ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం ఎక్కడున్నాది, ఎక్కడున్నది
చేతకాక చేతులెత్తేసిన కమీషన్లు
బూతుల దగ్గరే బ్రోకర్లందరు డబ్బులు పంచి రిగ్గింగ్ చేస్తే
చోద్యం చూస్తూ కూచున్న లంచగొండులు పోలీసు వ్యవస్థతతో
ప్రభుత్వానికి తొత్తులుగా మారిన రిటర్నింగ్ ఆఫీసర్లుతో
పవర్ ప్రొసెసింగ్ పదిదారులు చూపే
తాగుబోతు దద్దమ్మ ఆఫీసర్లు
ఎక్కడినుంచో యిక్కడ బారులు తీరి ఓట్లు వేస్తుంటే
జ్ఞానులంతా అజ్ఞానులై ఓటింగే బహిష్కరిస్తే
కమీషనునే ఖాతరు చేయక బుడ్డి, డబ్బు, ముండల సరఫరా చేస్తూ ఉంటే
రాజ్యాంగాని కాలరాసి రాజ్యాంగం చేసే రాజకీయ పార్టీలు
ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం, భారతావనిలో ఎక్కడుంది?
మందుషాపులు, ముండల షాపుల, నోట్ల కట్టలతో నిండిపోతే
ముందుకు మూసి వెనకకు తెరిస్తే
పనికిమాలినవారు రాజకీయ నాయకులు రాజ్యమేలితే
చదువేలెసి లేబర్ క్లాస్ ఓట్ల బ్యాంకులైతే
ప్రజాస్వామ్యం ప్రజాస్వామ్యం ఎక్కడుంది, ఎక్కడుంది
ఈ బూర్జువాపార్టీలున్నన్నాళ్లు
రౌడీ షీటర్లే రాజ్యంలేలితే
చదువుకున్న మేధావులకు రాజకీయల్లో చోటు దొరకక
చచ్చు వెధవలై మిగిలిపోతే
ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం పంచల పాలు

...కవితా రచన
ప్రొ.అప్పాజి భగవాన్

# పంచాంగం

మాసం : ఆషాఢ శుద్ధ పాడ్యమి; రా.11.20; ఆర్ద్ర ఉ.7.51; రా.వ.7.20ల 8.51.

బుధవారం 03-07-2019

**మేషం** : ప్రభుత్వ సంస్థలలోనివారు మార్పులకై చేయు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తు లకు సమస్యలు తలెత్తినా తెలివితేటలతో పరిష్కరించ గలుగుతారు. మీ సంతానం, పెద్దల ఆరోగ్యంలో మెలకువ అవసరం. **వృషభం** : బ్యాంకింగ్ అధికారులతో సంభాషించేటప్పుడు జాగ్రత్త వహించండి. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ అవసరం. నూతన వ్యాపారాలకు శ్రీకారం చుట్ట గలరు. **మిథునం** : కోర్టు వ్యవ హారాలలో చికాకులను ఎదు ర్కొంటారు. నూత నంగా పరిచయమైన వ్యక్తులపట్ల మెలకువ అవసరం. దంపతుల మధ్య కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర వుతాయి. వృత్తి, ఉద్యోగాలందు ఉన్నవారికి ఆదాయం బాగుంటుంది. మీ ప్రియ తముల పట్ల, ముఖ్యులపట్ల శ్రద్ధ పెరుగుతుంది. **కర్కాటకం** : రాజకీయాల లోని వారు ఆచి తూచి వ్యవహ రించాల్సి ఉంటుంది. వాహనాలు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు సంభవం. కష్ట సమయంలో బంధువులు అండగా నిలుస్తారు. ప్రముఖులతో చర్చలు జరపుతారు. స్త్రీలు అపరిచిత వ్యక్తులపట్ల మెలకువ అవ సరం. ఆలయాలను సందర్శిస్తారు. **సింహం** : ఉద్యోగస్తులకు బాధ్యతలు అధికం అవుతాయి. సంఘంలో మీ కీర్తి, ప్రతిష్టలు ఇనుమడిస్తాయని చెప్పవచ్చు. వైద్యులకు మెలకువ అవసరం. బంధుమిత్రుల రాకపోకలు పెరుగుతాయి. **కన్య** : కాంట్రాక్టర్లకు సదవకాశాలు లభించినా ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొనక తప్పదు. మీ సంతానం మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించేటప్పుడు మెలకువ అవసరం. నూతన వ్యాపారాలకు శ్రీకారం చుట్టండి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. **తుల** : స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తలెత్తినగానీ నెమ్మదిగా సమసిపోతాయి. హామీలు ఉండుట మంచిది కాదని గమనించండి. స్పెక్యులేషన్ చేయువారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఆడిటర్లకు గుర్తింపు, రాణింపు లభి స్తుంది. హోటల్, తినుబండారాల వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుంది. **వృశ్చికం** : ఇతరుల ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసు కోకండి. శత్రువులపై విజయం

# రాజసం ఉట్టిపడే రాతి నిర్మాణాలు

## సంకీర్తన


త్రికుటేశ్వరాలయం

సూర్యాపేటకు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిల్లలమర్రిలో కాకతీయుల కాలంలో జీవం పోసుకున్న దేవాలయాలు, శిల్పకళా సంపద.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయి. బౌద్ధ మతానికి సంబంధించిన ప్రతిమలను, జీవిత ఘట్టాలను, జ్ఞానోదయ చిత్రాలతోపాటు శాంతి చిహ్నాలు తదితర సన్నివేశాలు, ఆరామ కుడ్యాలపై ఎంతో అద్భుతంగా చెక్కబడ్డాయి. బౌద్ధ శిల్పకళలో సహజ సుందర దృశ్యాలకు, పశు పక్షాదులకు కూడా స్థానం లభించింది. అయితే మత ప్రచారానికి తోడ్పడే విధంగా అది రూపాంతరం చెందింది. ఉత్తర దక్షిణ శిల్పకళా సంస్కృతుల సమ్మేళనంతో కొత్త తరహా శిల్పకళను ఇక్కడ ప్రవేశపెట్టిన ఘనత కాకతీయులకే దక్కింది. క్రీ.శ.1000 నుంచి 1324 వరకు కాకతీయరాజులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. ఇదే కాలంలో వారి సామంతులుగా, మాండలికులుగా నల్లగొండను పాలించిన రేచర్ల వంశస్థులు ఈ తరహా శిల్పాలను ఆదరించారు. వీటిలో భాగంగానే పిల్లలమర్రి, పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామాల్లో నిర్మించిన దేవాలయాలు శిల్పుల మేధాశక్తి, కళలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. ఒకవైపు కాకతీయ సామ్రాజ్య సంరక్షణకు యుద్ధాలు చేస్తూనే మరోవైపు శిల్పకళను ప్రోత్సహించడం వారి బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు నిదర్శనం. ఆనాటి శిలలపై నగ్న దృశ్యాలు, సౌందర్య కుసుమాలు తదితర దర్పణంలాంటి చెక్కడాలు కళ్లను మైమరిపిస్తాయి.

**త్రికుటేశ్వరాలయం**

పిల్లలమర్రి గ్రామం ఉన్న త్రికుటేశ్వరాలయాన్ని కాకతీయుల రాజు అయిన రేచర్ల నామిరెడ్డి క్రీ.శ.1202లో నిర్మించారు. దుందుభి నామ సంవత్సరం చైత్రశుద్ధ ఏకాదశి శనివారం నాడు రాజు తన పేర నామేశ్వరలింగం ప్రతిష్ఠించి పూజాధికారులకు, దూపదీప నైవేద్యాలకు భూదానం ఇచ్చారు. ఈ విషయం వివరిస్తూ అక్కడ శాసనం కూడా రాయించారు. అదే ఆలయంలో మూడు శివాలయాలు ఏర్పాటు చేశారు. నామిరెడ్డి పేరు మీద నామేశ్వరాలయం మొదటిది కాగా, రాజు తన తల్లి పేరు మీద కాచేశ్వర, తండ్రి పేరున కామేశ్వర లింగాలను దేవాలయంలో ప్రతిష్ఠించాడని శాసనంలో ఉంది.

**దేవాలయాలతోపాటు పెద్దచెరువు**

పిల్లలమర్రిలో శిల్పకళా సంపద ఉట్టిపడే దేవాలయాలే కాదు.. త్రికుటేశ్వరాలయానికి అతి సమీపంలో పెద్ద చెరువు కూడా ఉంది. మూసీ నదిలో నీళ్లున్నంత కాలం ఆ చెరువులో జలకళ ఉట్టిపడుతుంది. **800 ఏళ్ల నాటి బావి**

ఎరుకేశ్వరాలయ ఆవరణలో 800 సంవత్సరాల క్రితం బేతిరెడ్డి భార్య ఎరుకసాని తాగునీటి కోసం తవ్వించిన బావి ఇప్పటికీ ఉంది. ఎంతటి వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు వచ్చినా ఆ బావిలో నీరు ఇంకిపోలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

**త్రికుటాలయంలో ఆసక్తికరమైన నంది**

త్రికుటేశ్వరాలయంలో శివలింగాలను కాపాడేందుకు రేచర్ల నామిరెడ్డి నంది విగ్రహాన్ని చేశారు. ఆ నంది మూడు శివలింగాలను కాపాడుతున్నట్లు అనిపిస్తుంది. మూడింటిలో ఏ శివలింగం ముందు నిలబడి చూసినా నంది దాని వైపే చూస్తున్నట్లుగా కనిపిస్తుంది. అక్కడకు వచ్చే భక్తులు మూడు లింగాలను దర్శించుకొని వెళ్తుంటారు.


త్రికుటాలయంలో ప్రత్యేక నంది విగ్రహం





## నేటి నుంచి జగన్నాధస్వామి

# రధోత్సవ మహోత్సవాలు

భీమునిపట్నం : శ్రీశ్రీశ్రీ సుభద్ర జగన్నాధస్వామి కళ్యాణ రధోత్సవ మహోత్సవాలు బుదవారం నుంచి ఈనెల 12 వరకూ నిర్వహించ నున్నట్లు దేవాదాయశాఖ వంశపారంపర్యప్రధాన అర్చకులు రొంపిచర్ల సింగరాచా ర్యులు తెలిపారు. బుదవారం అనగా ఈ రోజు అనగా బుదవారం ఉదయం 6.30కు నేత్రోత్సవం, సాయం త్రం 6నుండి శ్రీ సుభద్ర జగన్నాధ స్వామి కళ్యాణ మహోత్సవం,4న ఉదయం9 గంటలకు తొలి రధాయాత్ర, సాయంత్రం 4 గంటలకు వేదపురుషావతారం, 5న మత్స్యావతారం, 6న కూర్మావతారం, 7న వరహ నరసింహ అవతారం, 8న వామనావతారం, 9న పరశు రామావతారం, 10న రామావతారం, 11న కృష్ణావతారం, 12న ఉద యం శేషశయనావతారం (తొలి ఏకాదశి) ఉదయం 7గంటల నుండి విశేష పూజలు,10.30 కు గీతాపారాయణం,సాయంత్రం 4గంటలకు మారు రధోత్సవంరాత్రి 9గంటలకు తిరువీధి తరువాత వైకుంఠ మందిర ప్రవేశం,లక్ష్మీ జగన్నాయక సంవాదము వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

# శక్తి టీమ్ వాహనాలు ప్రారంభం



అనకాపల్లి : మహిళలకు, విద్యార్థినిలకు అండగా నిలిచే పోలీస్ శక్తి టీమ్ నూతన వాహనాలను మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. మహిళా పోలీస్, టౌన్, రూరల్ పోలీ సుల ఆధ్వర్యంలో ఈ శక్తి టీమ్‌లు పని చేయడం జరుగుతుంది. వీటి కోసం ప్రత్యేకంగా కొత్త వాహనాలను మంగళవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. మొత్తం 9 మందితో కూడిన శక్తి టీమ్‌ను నియమించడం జరిగింది. అందులో అనకాపల్లి టౌన్ పరిధిలో మనిషా, లోవ,ఉమా, మహేశ్వరి ఒక టీమ్‌గా నియమించారు. అలాగే రూరల్ పరిధిలో (కశింకోట, సబ్బవరం, యలమంచిలి) పరిధిలో శ్యామల, వెంకటలక్ష్మి, రేవతి రాజశివ, దాక్షాయణి, నియమించబడ్డారు. ఎక్కడైనా ఎప్పుడైనా మహిళలు, గాని విద్యార్థులు గాని వేధింపులు, బెదిరింపులు పాల్పడినా 630 9917171 అనే నెంబరుకు సమాచారం అందిస్తే సమాచారం అందు కున్న కొద్ది సమయంవ్యవధిలోనే షీ టీమ్ అక్కడకు చేరుకుని మహిళలను రక్షించడం, నిందితులను అదుపులోకి తీసుకోవడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.

# ఈ సత్కారం మరువలేనిది

– రిటైర్డ్ ఉద్యోగుల మనోగతం



విజయనగరం:రెవిన్యూ శాఖలో వివిధ హోదాల్లో పని చేసి పదవివిరమణ పొందడం చాలా సంతృప్తి నిచ్చిందని జిల్లా రెవిన్యూ శాఖలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇద్దరు ఉప కలెక్టర్లు, ఒక తాహసిల్దారు, జూనియర్ అసిస్టెంట్, కలె క్టరేట్ బంగ్లాలో వంట మనిషి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.హరి జవ హర్‌లాల్ వారిని ఘనంగా సత్కరిం చారు. అనంతరం సత్కర గ్రహీతలు మాట్లాడారు.


**పాస్‌పోర్టు పోయినది**

తగరంపూడి రవి శ్రీనివాసులు S/o. దేముడు అను నేను తేదీ: 09-06-2019న మాధవధార నుండి మురళీనగర్ జంక్షన్‌కి వస్తున్నప్పుడు మార్గం మధ్యలో నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది.
పాస్‌పోర్టు నెం: **R7875140**
దొరికిన వారు ఈ క్రింది ఫోన్‌నెంబరుకు తెలియజేయగలరు.

**8019148040**



**IN THE HONORABLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AT VISAKHAPATNAM.**
**I.A.No.1091/2018**
**O.S.No.781/2015**

**Between:**
**Smt.Kandregula Hymavathi**
**Rep., by her relative Sri.Kandregula Venkata Rao S/o.Sri. K.Venkata Ramana through Regd.GPA.**
**...Petitioner/Plaintiff**
**AND**
**Sri.Yellapu Madhava Rao ...Respondent/Defendant**

**NOTICE**

**To,**
**The Respondent/Defendant**
**Sri Yellapu Madhava Rao S/o.Y.V.Ramana, Hindu, Aged 47 years, residing at Flat No.401, White House Apartment, SBI Building, Seethammadhara, Visakhapatnam-530013.**

Please take notice that the above Petitioner/Plaintiff has filed final decree petition in I.A. No.1091/2018 in O.S.No.781/2015 against you and the same was posted to **09-08-2019** for your appearance on that day at **10:30AM.** You should appear before the aforesaid Honorable Court either in person or through an Advocate without fail. Hence the matter will be determined in your absence, exparte.

**Karri Adi Babu**
**Advocate**
**Visakhapatnam.**
**Cell No: 9396 260139**


## ఇనాం రైతులు

# దరఖాస్తు చేసుకోండి

సబ్బవరం : అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయి పరిహారం దక్కని ఇనాం రైతులు దరఖాస్తులుచేసుకోవాలని తహశీల్దార్ కె.రమాదేవి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని బాట జంగాల పాలెం, ఇరువాడ, అసకపల్లి, గాలిభీమవరం, అమృత పురం, సబ్బ వరం, మొగలిపురం గ్రామాల్లో భూములు కోల్పోయి, పరిహారం దక్కని ఇనాం రైతులు ఉన్నారన్నారు. ఇనాం రైతులు అంతా వారి వద్ద ఉన్న ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే పరిహారం చెల్లింపు లకు ఫారం-8 జారీ చేస్తామన్నారు. ఫారం-8తో రైతులు అందరూ ప్రభుత్వం నుండి పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. సోమ వారం ప్రజావాణిలో బాటజంగాలపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 76/2, 72/2, 41/1 ఇనాం రైతులు 28 మంది ఫారం-8 కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. కాగా మండలంలో చాలా గ్రామాల్లో ఇనాం రైతుల వద్ద ఎటువంటి పత్రాలు లేవని, అధికార్లు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి ఫారం-8 లు ఇప్పించాలని పెద నాయుడుపాలెం, సబ్బవరం రైతులు కోరుతున్నారు.

# ప్రజావేదికను ప్రజా కల్యాణ మండపంగా మారిస్తే బాగుండేది

### బీజేపీ అంటే భయమా? సిఎంను ప్రశ్నించిన జై అనకాపల్లి సేన నాయకుడు సీతారాం



అనకాపల్లి : విజయవాడ కర కట్ట పై న ప్రజా ధనం తో నిర్మించిన ప్రజా వేదిక అక్రమ కట్టడం గా పేర్కొంటూ దానిని తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం దానిని కూల్చి వేయకుండా ప్రజా కల్యాణ మండపం గా మార్చి ఉంటే ప్రభుత్వం పట్ల ముఖ్యమంత్రి జగన్ పట్ల రాష్ట్ర ప్రజలకు మంచి పేరు వచ్చే ది అని, అలా కాకుండా కూల్చి వేయడం ద్వారా ప్రజా సొమ్ము దుర్వినియోగం అయ్యిందని జై అనకాపల్లి సేన నాయకుడు కొణతాల సీతా రాం పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో పేద మధ్య తరగతి కి చెందిన వాళ్ళు ఏ కార్యక్రమం చేసుకోవాలి అన్నా ప్రైవేట్ కల్యాణ మండ పాలకు లక్షలు చెల్లించాల్సి న పరిస్థితి లు ఉన్నాయని అన్నారు. అలాగే ఈ ప్రజా వేదిక లేనప్పుడు విజయవాడ ఏ 1 కన్వెన్షన్ హాల్ కు కలెక్టర్ల సమావేశాల నిర్వహణకు రోజుకి 5 లక్షలు చెల్లించేవారు అని తెలిపారు. ఈ అనవసర ఖర్చు ఉండకూడదు అని గత ముఖ్యమంత్రి చంద్ర బాబు ఈ ప్రజా వేదిక నిర్మించారు అని, ఇది అక్రమ నిర్మాణాలు గా చెప్పి తొలగించడం సబబు ఐతే కరకట్ట మీద వున్న గోకరాజు గంగరాజు బామ్మర్ది, మంతెన సత్యనారా యణ రాజు కు చెందిన లక్ష అడుగుల నిర్మాణం వైపు ఎందుకు చూడలేదని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబు ఉంటున్న నివాసానికి వెళ్లి నోటీసులు అందించిన అధికారులు మరి వాటికి ఇంకా నోటీసులు ఎందుకు అంటించలేదు అని నిలదీశారు. అలా చేయకపోవడం వలన ముఖ్యమంత్రి జగన్ కు బిజెపి అన్నా బిజెపి నాయకులు అన్నా భయం అని ప్రజల కు సందేహం కలుగుతోంది అని, మీకు నిజంగా బిజెపి అంటే భయ మేన అని ప్రశ్నించారు. నిజంగా మీకు అక్రమ కట్టడాలను తొలగిం చాలని అనుకుంటే తాము మద్దత్తు ఇస్తామని, ఆ తొలగింపు లు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో, తర తమ బేధాభిప్రాయం లేకుండా అన్ని తొలగించాలని అప్పుడే ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షిస్తారు అన్నారు.

# బాలల సంరక్షణ విద్యపై ప్రచారం




విశాఖపట్నం : ప్రస్తుతం బాలలపై అనునిత్యం అత్యాచారాలు, వేధింపులు జరుగుతున్న నేపథ్యంలో బాలలను అప్రమత్తం చేయట కొరకు బాలల సంరక్షణ విద్య అనే అంశంపై ప్రచారం నిర్వహిస్తున్నామని ధరణి సంస్థ కార్యదర్శి,రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం విశాఖపట్టణం కన్వీనర్ బి. హరివెంకటరమణ అన్నారు.

ధరణి,రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం, జ్ఞానాపురం లారీ పార్కింగ్‌షెడ్ దరి ఎ.ఎస్.ఆర్. నగర్ (చెంచు కాలనీ) బాలబాలికలు,మహిళలకు చిత్రాల ద్వారా బాలల భద్రత అంశాలను వివరించారు. బాలల హక్కులు, పాఠశాలల్లో,అపరిచితులతో, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి తల్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించి ప్రభుత్వం ఇస్తున్న ప్రయోజనాలను పొందాలని సూచించారు. రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం ప్రకారం పిల్లలు బడి బయట ఉండరాదని సూచించారు.

ఈ కార్యక్రమంలో ధరణి సంస్థ సభ్యులు పి.సత్యవతి,ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి మాడంగి నరేష్ తదితరులు పాల్గొని బాలల,మహిళల భద్రత అంశాలను ,విద్య అవశ్యకతను వివరించారు.

# కనకదుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా లలితా సహస్రహోమం

అన్నవరం.....తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి తొలిపావాంచ వద్ద కొలువైయున్న కనకదుర్గమ్మవారి ఆలయంలో అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకొని మంగళవారం లలితా సహస్రహోమం అత్యంత ఘనంగా జరిగింది.

ఉదయం 10 గంటలకు పండితులు గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం హోమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.11 గంటలకు పూర్ణహుతి నిర్వహించారు.వేద పండితులు వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ,ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమం లో ఏసి.ఈరంకి.జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు.

## పట్టణ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా సహకరించిన

# పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్‌కు అభినందనలు

**పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప**



పెద్దాపురం : పట్టణ అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా సహ కరించిన పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ కు అభినందనలు యని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ముగిసిన రోజైన మంగళవారం చిట్టచివరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కౌన్సిల్ ను ఉద్దేశించి మాట్లా డుతూ గత 5 సంవత్సరాలలో పట్టణంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు పార్టీలకు అతీతంగా పూర్తి సహకారం అందించి పట్టణ ప్రజలకు మంచి పనులు కల్పించినందుకు అభినందనలు తెలియజేశారు.శతాబ్ది పార్కు నుండి మొదలైన అభివృద్ధి,రోడ్డు విస్తరణ,సెంటర్ లైటింగ్, పార్కులు,సిమెంట్ రోడ్డు,బస్ కాంప్లెక్స్, రైతుబజార్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రి,అనేక అభివృద్ధి పనులు చేసినందుకు తిరిగి శాసనసభ్యులుగా రెండవసారి ఎన్నుకున్నం దుకు రుణపడి ఉన్నానని అన్నారు.రాబోయే రోజుల్లో రూ.12 కోట్లతో పెద్దాపురంలో గోదావరి త్రాగునీటి ప్రాజెక్టుకు సంబంధించి కృషి చేస్తానని తెలిపారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడుతూ మాజీ ఉప ముఖ్యమంత్రి హోదాలో రూ.1000 కోట్లతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినందుకు శాసన సభ్యులు చినరాజప్పకు కృతజ్ఞతలు తెలియజేసారు.28 వార్డుల కౌన్సిలర్లు ప్రజలకు అందచేస్తున్న మంచి పనులకు పూర్తి సహకారం అందించినందుకు చైర్మన్ గా వారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాని అన్నారు.శతాబ్ది పార్కుతో ప్రారంభమై చివర ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిర్మించిన పార్కుతో తమ పదవీకాలం పూర్తిచేస్తామని, మన హయాంలోనే 100 సంవత్సరాల మున్సిపల్ శతాబ్ది ఉత్సవాలు జరిపించుకోవడం మన అదృష్టంగా భావిస్తు న్నామని తెలిపారు.రాష్ట్రంలో ఉన్న 110 మున్సిపాలిటీల్లో పెద్దాపురం మున్సిపాలిటీ మొదటిస్థానం సాధించినందుకు కౌన్సిల్, మున్సిపల్ అధికారులు, పాత్రికేయుల కృషి ఎంతైనా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రెండవసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన రాజప్పను చైర్మన్, కౌన్సిల్, మున్సిపల్ అధికారులు సన్మానించారు. ఎమ్మెల్యే,చైర్మన్ కౌన్సిల్ ను,అలాగే ఎమ్మెల్యే, కౌన్సిల్ చైర్మన్ ను సన్మానించడం జరిగింది. అనంతరం అందరికీ విందు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కురుపూరి రాజు, మున్సిపల్ డిఇఇ రాజేష్, మేనేజర్ ప్రసాద్, టిపిఓ భాస్కర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, శానిటేషన్ అధికారులు, కాంట్రాక్టర్లు, ఆఫీసు సిబ్బంది, డ్వాక్రా మహిళలు, బొడ్డు బంగారుబాబు, తూతిక రాజు,రంది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం

# వైకాపా నాయకులు వార్డులు పర్యటన



భీమునిపట్నం : భీమిలి జోన్ లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు భీమిలి జోన్ వైకాపా నాయకులు, కార్యకర్తలు 1,5 వార్డులలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు జీరు సుజాత, నీలాపు రామిరెడ్డి, వెంపాడ రమణ, కుమిలి సూర్యనారాయణ తదితరులు వార్డు లో ఉన్న సమస్య లను జోనల్ కమిష నర్ ఎ ఇ లకు తెలిపారు. అదేవిధంగా చిట్టివలస ఏరు ప్రక్కన చెక్ డ్యామ్ కట్టాలని గ్రామస్తులు కోరారు.అలాగే 1.వ వార్డులో డ్రైనేజీ వెళ్ళడానికి మార్గం లేదని రోడ్లు మీదకు మురికి నీరు వస్తుందని ఈ విష యం మంత్రి అవంతి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.అలాగే తాగు నీటి సమస్య ఎక్కువగా ఉందని చెప్పారు. ఈ సమస్యలు విన్న వైకాపా కార్యకర్తలు అన్ని సమస్యలను రెండు రోజుల లో పరిష్క రిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వై.సి.పి.నాయకులు జగ్గుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి,చిల్ల భాస్కర్ రెడ్డి, అక్కర మాని రామనాయుడు, ఉప్పాడ నాగేశ్వరరావు, జి.వి.రమణ,బింగి హరి కిరణ్ రెడ్డి,పందిరి విజయ్, జీరు భారతి రెడ్డి, గోపాల్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి ముత్తంశెట్టి



మధురవాడ : విద్యుత్ వినియోగదారులకు నిరం తర విద్యుత్ సరఫరా ను అందించేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్రపర్యాటక, సంస్కృతిక మరియు యువజన శాఖా మాత్యులు అవంతి శ్రీనివాస్ తెలి పారు, మహా విశాఖ 5 వ వార్డ్ పరిధిలో హరిత ఉడా హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీఈపీడీసీఎల్ 33/ 11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి వినియోగదారుడు కు నాణ్యమైన విద్యుత్తును నిరంతరం సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయా లని ఆదేశించారు వుడా నిర్మించిన హరిత హౌసింగ్ స్కీమ్ తో పాటు ఐటీ సెజ్ లోని హిల్ నెంబర్ వన్, టూ, త్రీ లలో దీని ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు అంతేకాకుండా రుషికొండ, తిమ్మా పురం లాంటి ప్రాంతాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు భీమిలి నియోజక వర్గంలో మరో నాలుగు సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు, అలాగే ఇకపై తాను ఎక్కడ పర్య టించిన నేతలు కార్యకర్తలు అధికారులు పూలదండలు బొకేలు తీసుకు రావద్దని వాటి స్థానంలో విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు బుక్స్, టెక్స్ట బుక్స్ తీసుకురావాలని వాటిని పేద విద్యార్థులకు అందిద్దామని హితవు పలికారు, అనంతరం బోయపాలెం సమీ పాన ఉన్న పీపీ-1 యఅఅబతీఎ కాలనీను సందర్శించారు, కాలనీ పరిశీలించి స్థానిక సమస్యల పై ఆరా తీశారు.

పారిశుద్యం, పార్కులు, డ్రైనేజీలు పనితీరు పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే వీటిని పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.

# ప్రజలకు నీతి, నిజాయితీ, సేవా భావంతో పని చెయ్యాలి

### విశాఖ రేంజ్ డిఐజి ఎల్.కాళిదాస్ వేంకట రంగారావు



విజయనగరం: జిల్లా పోలీసు కార్యాలయాన్ని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్. కాళిదాస్ వేంకట రంగారావు సోమవారంనాడు సందర్శించి, జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వ హించారు. అంతకుముందు, జిల్లా పోలీసులు నుండి విశాఖపట్నం రేంజ్ డిఐజి గౌరవ వందనం స్వీక రించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమా వేశంలో విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్. కాళిదాస్ వేంకట రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యా లకు అనుగుణంగా పోలీసు యంత్రాంగ నీతి, నిజాయితీలతో పని చెయ్యాలన్నారు. పోలీసింగు అన్నది ఒక ఉద్యోగం కాదని ఒక మిషన్‌లాంటి దన్నారు. పోలీసుశాఖపై ప్రజలకు నమ్మకం ఎక్కువని, వాటిని నిలబెట్టుకొనేందుకు ప్రతీ ఒక్కరూ శక్తివంచన లేకుండా పని చెయ్యాలన్నారు. ప్రజలకు పోలీసులు సేవా భావంతోసహాయ, సహకారాలను అందించా లన్నారు. పోలీసు స్టేషనులను ఆశ్ర యించే మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల పట్లపోలీసులు మానవతా దృక్పధంతో వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని అందించేందుకు కృషి చెయ్యాలన్నారు. జిల్లాలో 70శాతం నేరాలు రోడ్డు ప్రమాదాలేనని, వాటిని నిరోధించేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వ హించాలని, కాషన్ బోర్డులను ఏర్పాటు చెయ్యాలన్నారు. సాంఘిక దురాచారాలను రూపుమాపాలని, బెల్టు షాపులు, గంజాయి, ఇసుక, గుట్కాల అక్రమరవాణాను పూర్తి స్థాయిలో నిరోధించాలని పోలీసు అధికారులను విశాఖ డిఐజి ఆదేశించారు. జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూజిల్లాలో పోలీసుశాఖ పరంగా చేపడు తున్న కార్యక్రమాలు డిఐజికు వివరించారు. ఈ కార్య క్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు,ఒఎస్‌డి జె. రామ్మోహనరావు, బబ్బిలి ఎఎస్పీ గౌతమీశాలీ, పార్వతీపురం ఎఎస్పీ సుమిత్ గరుడ్, ఎస్బీ డిఎస్పీ సి.ఎం. నాయుడు, మహిళా పిఎస్ డిఎస్పీ పెంటారావు, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీలు బి. మోహనరావు, సిహెచ్. పాపారావు, ట్రాఫిక్ డిఎస్పీ ఎం. శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్పీ జె.పాపారావు, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, సిఐలు వివి అప్పారావు, ఎర్రం నాయుడు, శ్రీహరిరాజు, రమేష్, వైవి శేషు, జి. రామకృష్ణ, దాశరది, ఆర్. శ్రీనివాసరావు, బి. వెంకటరావు, రాజుల నాయుడు, ప్రభాకరరావు, మోహనరావు, బిఎండి ప్రసాదరావు, శ్రీనివాసరావు,శంకరరావు, రమేష్ ఎస్‌ఐలు, ఆర్ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించండి



డాబాగార్డెన్స్ : ఇంటి స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి నిర్మాణం చేస్తున్న ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించాలని బాధితురాలు లక్ష్మి తెలిపారు. మంగళవారం విజెఎఫ్‌లో మీడియా సమావేశంలో పలు ఆరోపణలు చేశారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూకొత్త రోడ్డు పంజా జంక్షన్ బ్రహ్మం గారి వీధి లో ఉన్న 22 -1-71/2 డోర్ నెంబర్‌లో తన ఇల్లు ఉందన్నారు. అయితే తన ఇంటి ప్రక్కన సుబ్బారావు అనే వ్యక్తి తన ఇంటి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని వేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో బాధితురాలు తండ్రి నర్సింగ్ రావు, అత్త లక్ష్మి పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ములగాడ: సింధియా ప్రభుత్వ పాఠశాలలో 1988 నుండి 1995 సంవత్సరం వరకు 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు అందరూ 30 సంవత్సరాల తర్వాత ఈ పాఠశాలలో కలుసుకొని ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుంటూ గత స్మృతులను తలచుకుని ఆనందంతో విందును ఏర్పాటు చేసుకుని సాయంత్రం సమయం వరకు ఈ పాఠశాలలో ఒకరినొకరు ప్రస్తుతం చేస్తున్న వృత్తిపై అడిగి తెలుసుకున్నారు అనంతరం పూర్వ ఉపాధ్యాయులకు కాళ్లకు నమస్కరించి వారికి సాలువ కప్పి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఉపాధ్యాయులను సన్మానించారు అనంతరం పూర్వ విద్యార్థి కాకి అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉద్దేశించి మాట్లాడుతూ అప్పట్లో మాకు ఎంతో క్రమశిక్షణతో విద్యను బోధించిన విద్యతోనే మేమంతా జీవితంలో స్థిరపడాలని పలు పరిశ్రమలు ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మని ఇదంతా ఉపాధ్యాయుల చలవేనని ఆయన అన్నారు గతంలో మేము చదువుకున్న ఈ పాఠశాలను ఇప్పుడు చూస్తే మాకే ఆశ్చర్యకరంగా అనిపించింది ఎందుకంటే ఈ పాఠశాల అన్ని మౌలిక సదుపాయాలతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రస్తుతం విద్య బోధన జరుగుతుందని ఎంతటి అభివృద్ధి చేస్తున్న షిప్ యార్డ్ సి.ఎం.డి శరత్ బాబు విద్యార్థులందరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో పూర్వ విద్యార్థినీ విద్యార్థులు తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మందుబాబులకు జైలుశిక్ష

పరవాడ: మద్యంసేవించి వాహనాలు నడుపుతున్న 17 మందికి 2వ ప్రత్యేక మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు 20,400 రూపాయాలుతో పాటు నలుగురిక ి జైలు శిక్ష విదిస్తూ తీర్పునిచ్చింది. దీనికి సంబందించి స్టీల్ ప్లాంట్ సిఐ యస్ రాము, పరవాడ ట్రాఫిక్ ఎస్ ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారము లంకెలపాలెం, దెశపాత్రునిపాలెంలో డ్రంకె అండ్ డ్రైవ్ పరీక్షీలు నిర్వహించగా 17 మందిని గుర్తించారు. వీరిని కోర్టు ముందు హాజరు పరిచారు. వీరిలో గుజరాత్‌కు చెందిన నారాయణ బాయ్‌కి 15 రోజులు జైలు, 2000 రూపాయాలు అపరాద రుసుము, అచ్చుతాపురం మండలము గండివానిపాలెం గ్రామానిక ి చెందిన ఎన్ . శ్రీనువాసురావుకి 3 రోజులు జైలు, 2000 అపరాధ రుసుము, సీతంపేటకు చెందిన మహ్మద్ కాలమ్‌కు ఒక రోజు జైలు శిక్ష, 2000 రూపాయాలు ఫైన్ , నక్కపల్లికి చెందిన జి.నర్సింహరావుకు 3 రోజులు జైలు 2000 రూపాయాలు అపరాద రుసుము విదించిందనీ స్టీల్ ప్లాంట్ ట్రాఫిక్ సిఐ రాము, పరవాడ ట్రాఫిక్ ఎస్ ఐ రామకృష్ణ తెలిపారు.

# ఘనంగా స్వచ్ఛభారత్ పక్షోత్సవాలు

## హెచ్‌పిసిఎల్ మరియు జీవీఎంసీ సౌజన్యంతో



ములగాడ: భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వచ్ఛ భారత్ లో భాగంగా హెచ్పీసీఎల్ సంస్థ మరియు నగరపాలక సంస్థ వారి సౌజన్యంతో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంస్థ ప్రాంగణంలో సోమవారం సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఇంచార్జ్ వి రతన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని స్వచ్ఛభారత్ రథాలకు జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి మోదీ కొన్ని సంవత్సరాల క్రితమే స్వచ్ఛ భారత్ ను ప్రారంభించి మనదేశంలో అన్ని ప్రాంతాలలో స్వచ్ఛ భారత్‌ను పాటించి ఇప్పటికీ ఈ స్వచ్ఛ భారత్‌కు మంచి ఆదరణ ఉందని దీనిలో భాగంగానే ఈ రోజు మాసంస్థతోపాటు నగరపాలక సంస్థ కూడా చేయూతనిచ్చి స్వచ్ఛ భారత్ ను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి పరిశుభ్రత కోసం అవగాహన కల్పిస్తున్నామని ఇక్కడ ఉన్న 72 వార్డుల్లో ప్రచార రథాలతో ప్రజల్లో పరిశుభ్రం పై అవగాహన కల్పిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని అదేవిధంగా తమ తమ ఇల్లలలో తడి పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బందికి ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు అదేవిధంగా జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ హేమంత్ మాట్లాడుతూ ఈ స్వచ్ఛభారత్ పక్షోత్సవాలు ఈనెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు వాడవాడలా అవగాహన రథాలుతో ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని ప్రజలందరూ ఈ అవగాహన ప్రచారానికి అందరూ సహకరించాలని ముఖ్యంగా ప్లాస్టిక్ ను ఉపయోగించరాదని అదేవిధంగా మొక్కలు నాటి పకృతి పరిరక్షణకు తోడ్పడాలని ఆయన అన్నారు హెచ్పిసిఎల్ పి ఆర్ ఓ శర్మ మాట్లాడుతూ ఈ స్వచ్ఛభారత్ పక్షోత్సవాలు ముఖ్యంగా ప్రజల్లో మంచి అవగాహన రావాలని మన ఇల్లు పరిశుభ్రంగా ఉంటే మనదేశం కూడా అంతకుమించి అభివృద్ధి చెందుతుందని అదేవిధంగా మన ప్రాంత పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అప్పుడే పచ్చదనంతో దేశం వాతావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో ఉంటామని ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన మాటలు అప్పుడే నిజమవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో హెచ్పీసీఎల్ అధికారులు కాశీ శ్రీ రాములు రమా రామకృష్ణన్ మరియు మెడికల్ సైన్స్ ల్యాబ్ సిబ్బందితో పాటు మొబైల్ మెడికల్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# సేవతోనే ఆత్మ సంతృప్తి



విశాఖపట్నంః కోన కుంచయ్య ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలలో భాగంగా దివంగత కుంచయ్య గారి జన్మ దినోవత్సవాన్ని పురష్కరించికొని ఎ.వి.ఎన్. కాలేజీ రోడ్డు ఎదురుగా గల ప్రేమ సమాజం లెప్రసీహోం లో ఆశ్రయం పొందుతున్న వారందరికీ టీషర్టు, లుంగీ, టవల్ మొత్తం రూ.10,000/-లు విలువ చేసే వస్త్రాలను ట్రస్ట్ తరుపున వస్త్రదానం చేసినాము. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మేనేజింగ్ ట్రస్టీ కోన జగదీశ్వరరావు మాట్లాడుతూ సేవతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుంది కనుక ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. మా ట్రస్ట్ తరుపున మా నాన్నగారి పేరున వస్త్రదానం, అన్న ప్రసాద వితరణ చేసామని తెలిపారు. ప్రతీ సంవత్సరం క్రమ తప్పకుండా ట్రస్ట్ తరపున వివిధ రకాల సేవా కార్యక్రమాలను నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు ట్రస్టీలు కోన మహాలక్ష్మి, కోన అప్పలరాజు, కోన మురళీకృష్ణ, పూసర్ల బాలకృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీ ఇంటిని స్మారక కేంద్రంగా తీర్చిదిద్దాలి

## వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ



విశాఖపట్నంః మహాప్రస్థానం సృష్టికర్త విశ్వం మెచ్చిన మహాకవి శ్రీ శ్రీ గారి ఇంటిని స్మారక కేంద్రంగా ఏర్పాటు చేసి భావితరాలకు ఆ మహాకవి నడయాడిన నేలను బహుమతిగా అందివ్వాలని కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి రాజ్యసభ సభ్యులు విజయ్ సాయి రెడ్డి గారిని ఢిల్లీలో కలుసుకుని ఆయన కు వినతిపత్రం అందజేసి సవివరంగా వాస్తవ పరిస్థితులను విజయసాయి రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్తా గత చంద్రబాబు ప్రభుత్వం లోనూ అలాగే అంతకుముందున్న కిరణ్ ప్రభుత్వంలోనూ శ్రీశ్రీ నడయాడిన ఇంటిని ఎలాగైనా కొనుగోలు చేస్తాం అంటూ ప్రకటనలు గుప్పించారు ఇదంతా జరిగి దాదాపు తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా కానీ ఇంతవరకు ఆ దిశగా ఒక్క అడుగు కూడా పడలేదు.

విశాఖలోనే ఇలాంటి దౌర్భాగ్యం ఎందుకు వుంది? పక్కనే వున్న విజయనగరంలో గురజాడ నివసించిన ఇంటిని స్మారక కేంద్రంగా మార్చి లైబ్రరీ నిర్వహిస్తున్నారు.ఇటు పక్క వున్న రాజమండ్రి లో కందుకూరి వీరేశలింగం పంతులు నివసించిన ఇంటినీ స్మారక కేంద్రంగా మార్చారు. కానీ విశాఖలో పుట్టిన మహాకవి శ్రీశ్రీ నివసించిన ఇల్లు మాత్రం స్మారక కేంద్రంగా మారలేదు. ఇందుకు ఎన్నో కారణాలు చెప్పుకోవచ్చు. శ్రీశ్రీ యే ఆ ఇల్లు అమ్మేశాక ఇంకా దానిని శ్రీశ్రీ ఇల్లు అని ఎలా అంటారు? నిజమే కానీ తమిళనాడుకు చెందిన ప్రముఖ రచయిత ఆర్కే నారాయణన్ కూడా కర్ణాటకలోని తన ఇంటిని ఇలాగే అమ్మేశారు.. ఆయన అభిమానులు ,ప్రభుత్వం ముందుకు వచ్చి ఆర్కే నారాయణన్ ఇంటిని కొనుగోలు చేసి సాహిత్య కేంద్రంగా మార్చారు. సుమారు రెండున్నర కోట్ల రూపాయలు ఆ ఇంట్లో ఉంటున్న కుటుంబానికి చెల్లించారు.మైసూర్ లోని యాదవగిరిలో వున్నా ఈ ఇంటిని ఆర్కే నారాయణన్ మ్యూజియం గా పేరు పెట్టి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతులమీదుగా 2016 జులై23నప్రారంభించారు. సాహిత్యానికి ,కవులకు, రచయితలకు అక్కడి వారు ఇచ్చే గౌరవం అది. అదే విధంగా మనం చేయలేమా ? యుగకర్తగా, మహాకవిగా కీర్తిస్తున్న శ్రీశ్రీ ఇంటిని కేవలం కొన్ని లక్షల రూపాయలు సేకరించి తిరిగి కొనగలరు. ఈ శతాబ్దాన్నే ప్రభావితం చేసిన మహాకవి ఇంటిని భవిష్యత్ తరాలకు చూపించండి. శ్రీశ్రీ ని చదివి ప్రభావితమయ్యే నవతరం ప్రతినిధులు ఆ ఇంటిని చూడాలనుకొంటే వారికి ఆ అవకాశం కల్పించండి అని కోరారు. ఈ విషయంపై విజయ్ సాయి రెడ్డి గారు ఎంతో సానుకూలంగా స్పందించారని కొండా రాజీవ్ గాంధీ తెలియజేశారు. ఈ విషయమై భవిష్యత్తులో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి గారిని మరియు జిల్లా ఇంఛార్జి మంత్రి గారిని విశాఖపట్నం ఎంపి గారిని ఎమ్మెల్యేలను అందరిని కూడా తాను కలుసుకుంటానని వినతి పత్రాలు అందజేస్తామని కచ్చితంగా శ్రీశ్రీ ఇంటిని స్మారక కేంద్రంగా మార్చే వరకు కూడా సాయశక్తులా తాను కృషి చేస్తానని కొండా రాజీవ్ గాంధీ సందర్భంగా తెలిపారు.

# స్వామీజీ ఆశీర్వాదంతో రాజ్యాధికారం సాధ్యం

## తమిళనాడు మాజీ ఎమ్మెల్యే శేఖర్ శారదాపీఠ సందర్శన



విశాఖ సిటీః షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ పీఠాధిపతుల ఆశీర్వాదం, దైవానుగ్రహం ఉంటే రాజ్యాధికారం సాధ్యమని తమిళనాడు మాజీ ఎమ్మెల్యే చోడిగంజి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం పెందుర్తిలోగల శ్రీ శారదా పీఠాన్ని దర్శించుకున్న అనంతరం రాజశ్యామలా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ ఆశీర్వాదం గైకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఆధ్యాత్మిక కార్యక్రమాలు పీఠంలో నిర్వహించడం, అనంతరం పలు రాజకీయ విషయాలపై ఏకాంతంగా చర్చించారు. తమిళనాడులో ఉన్న పీఠాలు, మఠాలు, దేవాలయాల పరిస్థితులతో పాటు రాజకీయ పరిస్థితులపై వివరించారు.

# పిల్లలను బడిలో చేర్పించండి




ములగాడ: జీవీఎంసీ 48వ పరిధిలోగల ప్రకాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పిల్లలను బడిలో చేర్పించాలని కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాపురం హై స్కూల్ ప్రిన్సిపాల్ సుబ్బారావు పాల్గొని విద్యార్థులతో ర్యాలీని ప్రారంభించారు అనంతరం మ్యాజిక్ బస్ సభ్యులు ఉపాధ్యాయులు అందరూ కలిసి ఆ ప్రాంతంలో వీధుల్లో తిరుగుతూ పిల్లలను బడికి పంపించండి అంటూ నినాదాలు చేశారు అనంతరం ప్రిన్సిపల్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి ఉన్నత భవిష్యత్తును అందించాలని వారి బంగారు భవిష్యత్తుకు తల్లిదండ్రుల బాట వేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మ్యాజిక్ బస్ సభ్యులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# రక్తదానం ప్రాణదానంతో సమానం



## వానప్రస్త వృద్ధాశ్రమం సేవలు ప్రశంసనీయం

## ప్రతీ ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి

## మెగా రక్తదాన శిబిరం నిర్వహణ



విశాఖపట్నం : రక్తదానం ప్రాణదానంతో సమానమని కాబట్టి ప్రతిఒక్కరూ స్వచ్ఛంధంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సి.యం.ఆర్. గ్రూప్ సంస్థల అధినేత మావూరి వెంకటర రమణ పిలుపునిచ్చారు. మంగళవారం మురళీనగర్‌లో ఉన్న వానప్రస్త వృద్ధాశ్రమంలో మేనేజింగ్ ట్రస్టీ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్వంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో గౌరవ అతిథులుగా మావూరితో పాటు ఎ.పి. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు జి. సాంబశివరావు, వైకాపా నాయకులు చొక్కాకుల వెంకటరావు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, పశ్చిమ ఎ.సి.పి. దేవప్రసాద్ తదితరులు రక్తదానశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మావూరి మాట్లాడుతూ 2011 నుంచి వానప్రస్త వృద్ధాశ్రమం నిరంతరాయంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా వృద్ధులకు అన్నదానం, వస్త్రదానం చేయడంతో పాటు ప్రతి ఏటా జూలైలో రక్తదానశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథులు మాట్లాడుతూ వానప్రస్త ఆశ్రమం సేవలను కొనియాడారు. మేనేజింగ్ ట్రస్టీ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర ఆశీస్సులు, పర్యవేక్షణతో వానప్రస్తను మరింత అభివృద్ధిచేస్తూ ఎంతోమంది అనాథలకు చేయూత నందిస్తున్నామని



అన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి వానప్రస్త వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఎంతోమంది అనాథలను హక్కునచేర్చుకొని వారికి అన్ని సదుపాయాలు కల్పించిన ఘనత ఈ ఆశ్రమానికి చెందుతున్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ తమవంతు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. తదుపరి రక్తదానం చేసిన వారందరికీ అతిథుల చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం ట్రస్టీ ఆర్. తనూజ మోహన, డిజిఎం శ్రీనివాసరావు, కె. అశోక్‌కుమార్‌తో పాటు పెద్దఎత్తున స్థానికులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం లో రామస్వామి తోట వద్ద ఎంపిపి స్కూల్ మరియు చింతలమెరక ఎంపిపి స్కూల్ లోచింతా ముత్యాలు గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు చింతా రాంబాబు 90 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అథిదిగా కాట్రేనికోన మండల విద్యాశాఖాధికారి సిహెచ్ వి వి సత్యప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ దాతల సహకారం విద్యార్థుల కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని. విద్యార్థులు శ్రద్ధ తో చదివి భవిష్యత్తు లో ఉన్నత చదువులు చదివి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఈవో తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తు లో మరికొందరికి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు భాషల్లో విద్యను విద్యార్థులకు అందిస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు గమనించి విద్యాయార్థులు ను ప్రోత్సహించి పాఠశాల కు ప్రతిరోజు పంపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీహెచ్ వి వి సత్యప్రసాద్, దుర్గారావు,భాగిరాజు, శ్రీనివాస్, కొంకి రవి తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న సత్రములు కాటేజీల అద్దెలు పెంపు



సింహచలం :శ్రీ వరాహాలక్ష్మీనారసింహస్వామి వారి దర్శనార్థమైవచ్చు భక్తులసౌకర్యార్థం గల సింహగిరిపై మరియు కొండాద్రిగువునగల సత్రములు కాటేజీల ధరలను దేవాదాయ కమీషనర్ వారి అనుమతి ఉత్తర్వులు మేరకు గదుల అద్దెలను స్వల్పముగా పెంచుతున్నట్టు ఇదివరకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నవారు పెరిగిన అద్దెను అదనంగా చెల్లించవలసి ఉంటుందని పెరిగినధరలను జూలై 1నుండి అమలు చేస్తున్నట్టు దేవస్థానం అధికారులు తెలియజేశారు.

## వైడి అప్పారావు మృతికి సంతాపం



విశాఖపట్నం: కా॥ వై డి అప్పారావు బి హెచ్ పి వి లో సిఐటియు మాజీ అధ్యక్షునిగా, వివిధ కమిటీలకు నాయకుడిగా ఉంటూ కార్మిక సమస్యలపై అహర్నిశలు కృషి చేసేవారు.1990లో పార్టీ సభ్యునిగా చేరారు బిహెచ్పివి పదవీ విరమణ అనంతరం పాత గోపాలపట్నం లో నివాసం ఉంటూ ప్రజా సమస్యలపై ఎనలేని కృషి చేసారు. కా॥వైడి అప్పారావు మంగళవారం గుండెపోటుతో మరణించారు. వయస్సు 64 సంవత్సరాలు. కా॥ వైడి అప్పారావు మృతికి భారతకమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్విశాఖనగరకమిటీ సంతాపం తెలియ జేస్తుంది.

కా॥వైడి అప్పారావుగారు బిహెచ్పివి పదవీ విరమణ అనంతరం పాత గోపాలపట్నం రైల్వే స్టేషన్ బ్రిడ్జి కోసం పోరాటంలో భాగస్వాములయ్యారు, భవన నిర్మాణ కార్మికుల సంఘం, జిప్సం కార్మికుల సంఘంవంటి పలు సంఘలు ఏర్పాటుచేసి వారి సమస్యలపై పోరాటం చేస్తున్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ నగర కమిటీ సభ్యులుగా ప్రస్తుతం ఉన్నారు. కా॥ వైడి అప్పారావుగారికి బార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారి కుటుంభానికి పార్టీనగరకమిటీ సంతాపం తెలియజేస్తుంది.

## యువకుడి ఆత్మహత్యాయత్నం



యలమంచిలి, యల మంచిలి మున్సిపాలిటీ పరిధిలో పెద్దపల్లి గ్రామానికి చెందిన బి. దేవి శ్రీను (24) తనకు ఎదురైనా అవమానాన్ని భరించలేక మంగళవారం ఉదయం గుళికల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకొన్నారు. అది గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనకాపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి గ్రామంలో గత రెండు రోజుల నుండి కోళ్లను దొంగలు పట్టుకు పోతున్నారని కొంతమంది దేవి శ్రీనుపై అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా, దీనిపై పోలీసులు ఇంకా విచారణ చేపట్టక మునుపే, గ్రామస్తులు దేవి శ్రీనివాస్పై అనుమానంగా చూడటంతో ఇది తట్టుకోలేని దేవి శ్రీనివాస్ చేయని నేరానికి తనపై నింద మోపారని గుళికల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మొక్కల సంరక్షణే పర్యావరణ హితం:ఎస్పీ నయీం



కాకినాడ: గ్లోబలైజేషన్ కారణంగా వాతావరణ మార్పులు అతి వేగంగా సంభవిస్తూ భూమండలమంతా వేడిమికి గురై భయాందోళనలకు గురి చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మొక్కలను నాటా వాటి సంరక్షణే పర్యావరణ హితంగా ఉంటుందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ అద్నాం నయీం అస్మీ అన్నారు. వనం మనం కార్యమ్రంలో భాగంగా మంగళవారం కాకినాడ గ్రామీణం సర్పవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసహజమైన వాతావరణ మార్పులతో మానవాళికి ఎంతో ఉపయోగపడే సహజ వనరుల కొరత ఏర్పడుతోందన్నారు. తద్వారా రుతువులు సక్రమంగా ఏర్పడక ఆహారం త్రాగునీరు కొరత పట్టి పీడిస్తుందన్నారు. గ్లోబల్ వార్మింగ్ ఇలాగే కొనసాగితే స్వచ్ఛగాలికూడా కరువవుతుందన్నారు.ఇందుకు పరిష్కార మార్గంగా ప్రతి ఒక్కరు భాద్యతతో విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అత్యవసరమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా కృషి చేస్తున్నాయని ప్రజలు కూడా తమ వంతు భాద్యత చేపట్టాలన్నారు దేశంలోని మెట్రో పాలిటన్ ,నగరాలు, పట్టణాలు పల్లెలు త్రాగునీటి సమస్యతో అల్లాడుతున్నాయని.భూగర్భజలాల కొరతే ఇందుకు కారణమని అన్నారు. మొక్కల పెంపకంద్వారా వాతావరణ సమతుల్యత ఏర్పడి సంమృద్ధిగా వర్షాలు కురిసి తద్వారా సాగు ,తాగు నీటికొరత తీరుతుందన్నారు.ప్రజలంతా భాద్యతగా మొక్కల సంరక్షణ ఉద్యమంలా చేపట్టాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీశ్రీధరరావు,ఓఎస్డి చక్రవర్తి, ఎస్బీ డిఎస్పీ మురళీ మోహన్ ,పళ్లపురాజు,ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణ,సిఐలు మురళీకృష్ణ,రమణమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆక్వా చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ రెడ్డి



అమలాపురం: ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి శివారు భట్టుపాలెంలో మాజీ సర్పంచ్ చెరువులపై గ్రామస్థులు ఫిర్యాదు చేయండంతో పరిశీలించిన జిల్లా కలెక్టర్ మురళీ శ్రీధర్ రెడ్డి ఆక్వా సాగుకు సంబంధించిన అధికారుల అనుమతులు పొందిన తరువాతే ఆక్వా సాగు చేస్తున్నామని ఆక్వా రైతులు జిల్లా కలెక్టర్కు తెలిపారు. కాగా ఆక్వా చెరువుల వల్ల భూసారం నసించి భూగర్భ జలాలు కలుషితమై అడుగంటిపోతున్నాయని,కాలువలు చెరువులు ఆక్వా చెరువుల నుండి వచ్చే ఉప్పు నీటితో కలుషితం అవ్వడం వల్ల తాగేందుకు నీరు లేక అనారోగ్యం పాలవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్థులకు ఆక్వా రైతులు పరస్పరం వాగ్వాదానికి దిగడంతో పోలీసుల జోక్యంతో గొడవ సర్దుమనిగింది. అనంతరం ఉప్పలగుప్తం మండలం కూనవరం చెరువులపై వరి సాగు రైతు ఫిర్యాదు చేయండంతో పరిశీలించిన జిల్లా కలెక్టర్ మురళీ శ్రీధర్ రెడ్డి ఆక్వా చెరువుల నుండి విడుదల అయ్యే ఉప్పు నీరు పంట కాలువలోకి వదలడంతో ఉప్పు నీటిగా మారి భూసారం తగ్గి పంటలు సరిగా పండడం లేదని వరి రైతులు తమ భాదను కలెక్టర్ శ్రీధర్ రెడ్డికి విన్నపించుకున్నారు.

అలాగే బట్టుపాలెం గ్రామంలోని రైతులందరూ కలిసి ఆక్వా జోన్కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని, ఆక్వా జోన్ లేకపోయినప్పటికీ దుర్మార్గంగా చెరువులు తవ్వి వ్యవసాయ భూములను సర్వ నాశనం చేశారని, త్రాగడానికి కూడా మంచినీళ్ళు లేవని, పశు వులకు డబ్బాలతో నీళ్ళు తీసుకుని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే విషయమై ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, కలెక్టర్కు తమ గోడును విన్నవించుకున్నామని తమకు న్యాయం చేయాలని వ్యవసాయ రైతులు కోరారు.

## ఈ బ్రిడ్జికి మోక్షం ఎప్పుడో?



యలమంచిలి, యల మంచిలి పాత జాతీయ రహదారిపై ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి దశాబ్దం కాలం దాటిన దాని నిర్మాణం పూర్తి కాకపోవడం పాలకుల పనితీరుకు అర్థం పడుతుంది. యలమంచిలి ప్రజలకు, పరిసర గ్రామాల ప్రయాణీకులకు ప్రధాన సమస్యగా నిలిచిన రైల్వేగేటుపై బ్రిడ్జిని పూర్తి చేయడంలో నాయకులు విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులు ఈ రైల్వే బ్రిడ్జిని సకాలంలో పూర్తి చేయాలనే చిత్తశుద్ధిని, ఆశక్తిని కనబరచేదని పట్టణవాసులు విమర్శలు గుప్పిస్తూన్నారు. ఈ బ్రిడ్జిని ప్రస్తుతం ఎమ్మెల్యే కన్నబాబురాజు మొదటి సారి ఎన్నికైన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2008న అప్పటి వాణిజ్య పన్నుల శాఖ మంత్రి కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా శంకుస్థాపన జరిపారు. నేటికి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. రెండవ దపా కన్నబాబు రాజు ఐదేళు పాలన పూర్తి ఆయిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు 2013లో చివరి సంవత్సరం ఆంతా రాష్ట్ర విభజనతో పరిపాలన స్థంభించి పోయింది. అప్పటికి సగం పనులతో బ్రిడ్జి నిలిచిపోయింది. విభజన అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆ పార్టీ ఎమ్మెల్యే పంచకర్ల కూడా ఐదేళ్లు కాలం వెల్లబుచ్చిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. అంటే యలమంచిలి ప్రజలకు ప్రధాన సమస్య ఆయిన ఈ బ్రిడ్జి పనులను పాలకుల తీవ్ర నిర్లక్ష్యం చేయడం పట్ల యువకులు జీర్ణించుకొలేకపోతున్నారు. దీంతో రైల్వేగేటు సమస్య యలమంచిలి ప్రజలను దశాబ్దల నుండి కొనసాగుతునే వస్తూంది. మూడో దపా ఎన్నికైన కన్నబాబు రాజు ప్రత్యేక శ్రద్దతో యలమంచిలి ప్రజల ప్రధాన సమస్యగా నిలిచిన రైల్వేగేటుపై బ్రిడ్జిని పూర్తి చేసి చిరకాల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తారని యలమంచిలి ప్రజలు కోరుకుంటున్నారు.

## ఏయూ విసికి సోషల్ మీడియా సన్మానం



విశాఖపట్నం: స్వీడన్ పర్యటనను విజయవంతంగా ముగించి వివిధ విద్యాసంస్థలతో అంతర్జాతీయ ఒప్పందం కుదుర్చుకున్న ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఉపకులపతి ప్రొఫెసర్ జి నాగేశ్వరావును సోషల్ మీడియా క్లబ్, ఆంధ్రప్రదేశ్ కమిటీ ఘనంగా సన్మానించింది.రాష్ట్ర చైర్మన్ సన్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఒప్పందాలు చేసుకోవడంలో వి సి ఎప్పుడూ విజయ పరంపర సాధించారని పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యా కూడా గణనీయంగా పెరగడానికి, విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషిస్తున్న అయన భవిష్తలో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

కమిటీ సభ్యులు కరకవలస భాస్కర్ పట్నాయక్, ఫణి స్వామి, మొలకలపల్లి వెంకటేష్ చౌదరి, మనోరంజన్ ఆచార్య, తిలక్ పట్నాయక్, పవన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## వ్రత పురోహితులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఈవో సురేష్ బాబు



అన్నవరం..... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పని చేస్తున్న 13 మంది అదనపు వ్రత పురోహితులకు వ్రత పురోహితులుగా నియమిస్తూ సోమవారం దేవస్థానం ఈవో ఎంవి.సురేష్ బాబు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వ్రత పురోహుతులుగా నియామక పత్రాలు అందుకున్న వ్రత పురోహితులు హర్షం వ్యక్తం చేసారు.

## అత్యంత వైభవంగా శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం

అన్నవరం...... తూ.గో.జిల్లా అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు నంది వెలసిన శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా కనులు మిరుమిట్లు గొలిపే విధంగా జరిగింది.స్థానిక గ్రామ దేవతగా పూజలు అందుకొంటున్న మరిడమ్మ అమ్మవారిని దర్శించేందుకు ఉదయం నుండే పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు తరలి వచ్చారు. మహిళలు అమ్మవారికి చీర,సారె,చనివిడి, వడపప్పు,పసుపు,కుంకుమ ,గాజులు తమ శక్తి కొలది సమర్పించి మొక్కులను సమర్పించుకొన్నారు.అలాగే స్థానిక ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ అమ్మవార్ని దర్శించారు. ఆయన వెంట స్థానిక వైసీపీ పట్టణ అధ్యక్షుడు రాయవరపు.భాస్కరరావు,కాకినాడ పార్లమెంటరీ వైసీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు శెట్టిబత్తుల.కుమార్ రాజా, కొండపల్లి.అప్పారావు, అల్లాడ.సూరిబాబు, బివిస్వీ.ప్రసాద్, బత్తుల. రవికుమార్, దారా.వెంకటరమణ, బండారు.అర్జునరావు, బొబ్బిలి.వెంకన్న,కొల్లు. గణేష్ తదితరులు పాల్గొన్నారు.సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు గ్రామోత్సవంలో భాగంగా అమ్మవారి ఊరేగింపు దేవతామూర్తుల వేషధారణ మరియు పలు సంస్కృతిక కార్యక్రమాలు నడుమ అమ్మవారి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు బండారు.రమణ,ముత్యాలరావు మాష్టారు తదితరులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు.

## విజయ నిర్మల మృతికి సంతాపం తెలిపిన ఎంపి అనూరాధ



అమలాపురం: హైదరాబాద్లో ఇటీవల మృతిచెందిన ప్రముఖ సినీ నటి, దర్శకురాలు నిజయ నిర్మల మృతికి చింతిస్తూ చిత్రపటానికి అమలాపురం ఎంపి చింతా అనూరాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయనిర్మల నివాసంలో సూపర్స్టార్ కృష్ణను కలిసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపితోపాటు పులువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాంబిల్లి మండలంలో 333 మంది విలేజ్ వలంటీర్లు

యలమంచిలి, కొత్తగా ఏర్పడిన జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం చేపట్టిన విలేజ్ వలంటరీల నియామికంతో రాంబిల్లి మండలంలో సుమారు 333 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుంది. ఈ నియామికాలకు ఎస్టీ, ఎస్సీ, బిసి, ఇబిసిలకు కేటాయింపులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వూలు జారీ చేసింది. ఇంటర్ విద్యార్హత కలిగి, 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రతి వారు ధరఖాస్తు చేసుకొవచ్చునని పేర్కొన్నారు. మండలంలో ఉన్న 28 గ్రామాలకు విలేజ్ వారిగా వివరాలు ఇలా ఉన్నాయి. చిన కలవలాపల్లి - 5, దిమిలి - 27, కట్టుబోలు-8, మురకాడ - 7, మర్రిపాలెం - 5, కుమ్మరాపల్లి - 6, రజాల - 4, మామిడివాడ - 12, కొత్తూరు - 12, గోకివాడ - 17, గోవిందపాలెం - 8, గోరపూడి - 9, హరిపురం - 13, కోప్పుగొండుపాలెం - 7, కొత్తపట్నం - 16, కొత్తపేట - 10, కృష్ణాంపాలెం - 7, లాలంకోడూరు - 14, మూలజంప - 7, నర్సాపురం - 24, పంచదార్ల - 21, పెదకలవలాపల్లి - 18, పూడి - 5, రాజకోడూరు - 12, రాజల - 4, రాంబిల్లి - 23, వెల్చూరు - 9, వై.లోవ - 7, జడ్.చింతువా - 20, మంది చొప్పున నియామికం జరుగుతుంది. ఈ 19న ధరఖాస్తులు స్వీకరణతో జూలై 5న ముగుస్తూంది. జూలై 11 నుండి 25 వరకు ఇంటర్వూలు నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఆగస్టు 1 నియామిక ఉత్తర్వూలు అందిస్తారు. వీరు ఆగస్టు 15న విధులకు హాజరు కావలసి ఉంటుందని ఆధికార ఉత్తర్వూల్లో పేర్కొన్నారు.

## పరవాడలో వైసిపిపార్టీ కార్యాలయం

### రాష్ట సిఇసిసభ్యులు పైల దంపతులు హోమం

పరవాడ: మండలకేంద్రమైన పరవాడలో స్థానికఎమ్మెల్యే అనంరెడ్డిఅదీప్ రాజ్ సలహమేరకు వైసిపికార్యలయాన్ని ఏర్పాటుచేసారు. ఈకార్యలయాన్ని మంగళవారము వైసిపిరాష్టసిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు దంపతలు చేతులు మీదగాఇరవైఐదు మందీవేదపండితులుచే హెూమాలుచేసారు. అనంతరముశ్రీనువాసు రావు మాట్లడుతూఅదీప్ రాజ్ అదేశాలుమేరకుఈపార్టిఆపీసునుఏర్పాటు చేసామనీఅన్నారు. నెలకొక్కసారిమండల కార్యకర్తలుతోసమావేశాలు ఈకార్యల యంలో నిర్వహిస్తామనీ ఈసమావేశాలుకు ఎమ్మేల్యేఅదీప్ రాజ్ పోల్గోంటారనీ అయనతెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లాప్రదాన కార్యదర్శి చుక్కరామునాయుడు, మండలపార్టి ప్రెసిడెంట్ సిరపురపుఅప్పలనాయుడు,పియన్ రాజు, బండారు రామారావు,పైలహరేష్ ,గెడ్డంఉమ, వెన్నెలసన్యాశిరావు, పైలఅప్పలనాయుడు, పైలనరేష్ ,పైలటివిఅప్పారావు తథితర్లు పోల్గోన్నారు.

# నేడు డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి 81వ జయంతి



సాగర్‌నగర్ : డాక్టర్ మతుకుమిల్లి వీర వెంకట సత్యన్నారాయణ మూర్తి (ఎమ్‌వివిఎస్ మూర్తి) బహుశా తెలుగు నేలపై ఈ పేరు తెలియని వారు ఉండరు. విశేషమైన దూరదృష్టి, అంకితభావం, ఎంచుకున్న మార్గంలో ఎలాంటి కష్టనష్టాలు ఎదురైనా సాధించి తీరాలన్న ధృడనిశ్చయం గల డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి వ్యక్తిత్వం ఎందరో జీవితాలను సైతం ప్రభావితం చేయడమే కాక ఎన్నో కుటుంబాలలో వెలుగులను నింపుతోంది. భారత పార్లమెంట్ సభ్యుడుగా విశేష సేవలు అందించిన డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి న్యాయవాదిగా, పారిశ్రామికవేత్తగా, విద్యావేత్తగా, సామాజిక కార్యకర్తగా బహుముఖ ప్రజ్ఞతో ఆంధ్రులు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తిగా ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యునిగా వ్యవహరిస్తూ గత ఏడాది అక్టోబర్ లో అమెరికా లో జరిగిన రహదారి ప్రమాదంలో మరణించడం విశాఖ నగరం పెద్ద దిక్కును కోల్పోయినట్లుఅయింది.స్వర్గీయ డాక్టర్ ఎం.వి.వి.ఎస్.మూర్తి 81వ జయంతి సందర్భంగా జులై 3వ తేదీన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రక్తదాన శిభిరంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మూలపాలం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జులై 3వ తేదిన జన్మించిన డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయ విద్యలో డిగ్రీని, ఆర్థిక శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిగ్రీని బంగారు పతకంతో సహా అందుకున్నారు. ఆర్థికశాస్త్రంలో పరిశోధన ద్వారా పిహెచ్‌డి (డాక్టరేట్)ను అందుకున్నారు. పూర్తి చేసినఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైకోర్టులో న్యాయవాద వృత్తితో జీవితాన్ని అభివృద్ధి వైపు మళ్లించుకున్న డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి తనలో ఉన్న వ్యక్తిగత ప్రతిభను ఆకాంక్షలకు జోడిస్తూ పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేసి స్టార్ ఎక్స్‌పోర్టర్‌గా పేరు గడించారు.

యువపారిశ్రామిక వేత్తగా తొలి నాళ్లలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిన డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి పారిశ్రామిక మండలులలో ఛైర్మన్‌గా సహితం కీలక పాత్ర వహించారు.విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా తన సమర్ధతను, ప్రజల అభిమానాన్ని చొరగొన్న డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి విశాఖ పోర్టు ట్రస్టు, ఎల్‌ఐసి, ఆకాశవాణి, ప్రాంతీయ ప్రత్యక్ష పన్నుల విభాగం వంటి శాఖలలో సలహాదారునిగా ఆయా శాఖల ప్రగతిలో తనదైన పాత్ర పోషించారు.

స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రోత్సాహంతో ప్రత్యక్ష రాజకీయాలలో సహితం పాల్గొనడం ద్వారా విలువలు గల రాజకీయ వేత్తగా రాజకీయాలలో తనదైన ముద్రను చూపారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారు.

మహాత్మా గాంధి మార్గాన్ని అనుసరిస్తూ గాంధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యా సంస్థలను 1980 సంవత్సరంలో విశాఖలో ప్రారంభించారు.

ఉన్నత విద్యలో వృత్తి విద్యా నిపుణులను అత్యుత్తమ ప్రమాణాలతో దేశానికి అందించాలన్న డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి తన లక్ష్యాలను సాధించడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో గీతం విద్యా సంస్థలను విస్తరింప చేశారు. దేశంలోని అత్యుత్తమ డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో ఒకటిగా కీర్తి ప్రతిష్టలు సాధించిన గీతం విశ్వవిద్యాలయం నేడు ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, లా, సైన్స్, నర్సింగ్, ఎమ్‌బిబిఎస్, మేనేజ్‌మెంట్, అంతర్జాతీయ వాణిజ్యం వంటి కోర్సులతో పాటు సామాజిక శాస్త్రాలను సహితం భోదిస్తూ ప్రపంచ వ్యాప్తంగా తన ఖ్యాతిని పెంచుకుంటోంది.

వైద్య రంగంలో నిరుపేదలకు ఉన్నత వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో డాక్టర్ ఎమ్‌వివిఎస్ మూర్తి నెలకొల్పిన గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్యశాల ఉచిత వైద్యంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది..జిమ్‌సర్ వైద్యాలయం ద్వారా విశాఖ నగరంలోని అన్ని వార్డులలో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందుబాటులోకి తేవడానికి 120 పైగా ఉచిత వైద్య శిభిరాలను నిర్వహించడం విశేషం.అలాగే గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి ద్వారా ఏటా లక్ష మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారు

# 4న జగన్నాథ స్వామి తొలి రధయాత్ర

- భక్తులు దర్శనానికి పూర్తి ఏర్పాట్లు
- నాలుగు లక్షల మంది వస్తారని అంచనా
- జగన్నాధ స్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి ప్రసాద్



విశాఖ సిటీ :జగన్నాధ స్వామి తొలి రథాయాత్ర ఈనెల 4వ తేదీ సాయంత్రం 4.55 ని.కు వన్ టౌన్ జగన్నాధ స్వామి దేవాలయం నుంచి ప్రారంభమవుతుందని దేవాలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. జగన్నాధ స్వామి రథాయాత్ర కార్యక్రమం వివరాలు తెలుపుతూ మంగళవారం దేవాలయం ప్రాంగణం లో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ స్వామి వారు నాలుగో తేదీన రథాయాత్ర గా టర్నర్ చౌల్ట్రీ కి వద్ద 9నవరాత్రులు భక్తుల దర్శనార్థం కొలువై వుంటారని తెలిపారు. ఈనెల 14తేదీ న మలియాత్ర వుంటుందన్నారు.పోలీస్, హెల్త్, ఆర్ అండ్ బి తదితర శాఖల సమన్వయం తో పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. రథాయాత్ర కు 15లక్షల వ్యయం అవుతుందన్నారు.పది అవతారాలలో స్వామి దర్శనం ఇస్తారన్నారు. పులిహోర, చక్కరపొంగలి, లడ్డు ప్రసాదాల ను సరసమైన ధరలకే భక్తులు కు అందుబాటులో వుంచామన్నారు. ఈ సమావేశంలో ఏడిద సురేష్ బాబు, జగన్నాదాచారులు, రంగనాధాచాలులు, కేశవాచారులు పాల్గొన్నారు.

### ఆధునిక శస్త్ర చికిత్స ద్వారా

# కృత్రిమమైన కవాట మార్పు

### ప్రముఖ కార్డియాలజిస్ట్ పాణిగ్రాహి



విశాఖపట్నం: గుండెకు రక్తాన్ని సరఫరా చేసే మహాధమని ద్వారము పని చేయకపోవడంతో రోగి తీవ్ర ఆయాసముతో బాధపడడం జరుగుతుంటుంది. అటువంటి సమయంలో చెడిపోయిన ధమనిని మార్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి నయం చేసి కృత్రిమ కవాటాన్ని మార్చి బతికించారు అపోలో వైద్యులు. సాధారణంగా ఇటువంటి పరిస్థితులలో ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా దీనిని నయం చేయడం జరుగుతుంటుంది. కానీ ఆ పరిస్థితికి కూడా రోగి ఆరోగ్యం సహకరించకపోవడంతో కాలి వద్ద ఉన్న నరం తీసి దీని ద్వారా కృత్రిమ కవాటాన్ని అమర్చి రోగికి ప్రాణం పోశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో విదేశీ కవాటాన్ని సాధారణంగా అమర్చుతుంటారు వైద్యులు. కానీ అపోలో వైద్యులు సాహసం చేసి తమ పరిజ్ఞానంతో స్వదేశీ కవాటాన్ని అమర్చి విజయం సాధించారు. అయోర్టిక్ వాల్వ్ చెడిపోవడంతో ఒకే మార్గములో రక్తాన్ని నియంత్రించడం సుసాధ్యం కాదు. తావి పద్ధతి ద్వారా కృత్రిమ కవాటము అమర్చి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. పాణిగ్రాహి ఆధ్వర్యంలో సిటీ సర్జన్స్, ఎనస్తీషియన్లు, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్లు, బ్లడ్ బ్యాంక్ బృందం తదితరులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

# కావాలనే భద్రత తగ్గించారు

- మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- భద్రత పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి: తనకు భద్రత కుదింపుపై తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో వాదనలు ముగిశాయి. మావోయిస్టుల నుంచి ముప్పు పొంచి ఉందని, కావాలనే రాజకీయ కారణాలతో ఆయనకు భద్రతని తగ్గించారని చంద్రబాబు తరఫు న్యాయవాది సుబ్బారావు కోర్టులో వాదించారు. గతంలో చంద్రబాబుపై అలిపిరిలో జరిగిన దాడి ఘటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

తెదేపా అధినేతతో పాటు ఆయన కుటుంబానికీ భద్రత తగ్గించారన్న విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఎర్ర చందనం స్మగ్లర్లకు వ్యతిరేకంగా చంద్రబాబు తీసుకున్న చర్యల వల్ల వారి నుంచీ ఆయనకు ముప్పు ఉందని తెలిపారు.

అయితే, తామెక్కడా చంద్రబాబుకు భద్రత తగ్గించలేదని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ న్యాయస్థానానికి వివరణ ఇచ్చారు. ఇవ్వాల్సిన భద్రత కంటే ఎక్కువే ఇస్తున్నామని, మాజీ ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబుకి 58 మంది భద్రతా సిబ్బందిని మాత్రమే ఇవ్వాల్సి ఉందని.. అయితే ప్రస్తుతం తాము 74 మందిని ఇచ్చామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ప్రస్తుతం చంద్రబాబుకు ఎంతమందిని, ఎక్కడెక్కడ, ఏయే స్థానాల్లో భద్రత కల్పిస్తున్నారో వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం ఈ తీర్పును వచ్చే మంగళవారానికి (ఈ నెల 9వ తేదీ) వాయిదా వేసింది.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే విత్తన కొరత

అమరావతి: వేరుశెనగ విత్తనాల సరఫరాపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రస్తుతం కొరత తలెత్తిందని వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు అన్నారు.

ముందస్తు ప్రణాళిక లేకుండా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆయన మండిపడ్డారు. విత్తనాల కొరత అంశంపై తెదేపా నేతలు చేస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయన స్పందించారు. గత ప్రభుత్వం విత్తనాల కోసం రాయితీ నిధులు ఇవ్వలేదని ఆరోపించారు.

# తాగునీటి ఎద్దడికి నిర్వహణ లోపమే కారణం

### అవినీతి రాజకీయాలవల్లే చెన్నైలో నీటికొరత

### కిరణ్‌బేడీ వ్యాఖ్యలను ఖండించిన స్టాలిన్

సైదాపేట: చెన్నై తాగునీటి ఎద్దడికి నిర్వహణ లోపాలే కారణమని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీ ఆరోపించారు. చెన్నైలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాగునీటి సరఫరాకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. జోలార్‌పేట నుంచి రైలులో తీసుకురావడానికి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పుదుచ్చేరి గవర్నర్ కిరణ్‌బేడీ చెన్నై తాగునీటి ఎద్దడిపై సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఆరో పెద్ద నగరం చెన్నై అని, అలాంటి నగరంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. నాలుగు సంవత్సరాల కిందట వరదలు వచ్చాయని, అలాంటి ప్రాంతంలో ప్రస్తుతం తాగునీటి కరవు నెలకొనడం దారుణమన్నారు. దీనికి అధికారుల అలసత్వం, నిర్వహణ లోపాలు, అవినీతి రాజకీయాలే కారణమన్నారు. ప్రజలు ఎక్కువ స్వార్థం, పిరికితనంతో కూడిన గుణాలు కలిగి ఉన్నారన్నారు. పుదుచ్చేరిని కాపాడడానికి అందరం కలిసి పనిచేయాలని, లేకుంటే చెన్నైకి పట్టిన గతే పుదుచ్చేరికి పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

**కిరణ్‌బేడీ వ్యాఖ్యలను ఖండించిన స్టాలిన్**

నీటి ఎద్దడి గురించి కిరణ్‌బేడీ చేసిన వ్యాఖ్యలను డీఎంకే అధినేత స్టాలిన్ ఖండించారు. ఆమె వ్యాఖ్యలకు నిరసనగా శాసనసభ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. శాసనసభలో సోమవారం రాష్ట్రంలో నెలకొన్న తాగునీటి సమస్యపై డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ప్రత్యేక తీర్మానంతో ముందుకొచ్చారు.

# ఏపీలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు

### ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు ఉండవు

### 90 మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

### పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పాలకవర్గాల పదవీకాలం ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.

ఇవాళ్టితో పాలకవర్గాల గడువు ముగిసిన తొమ్మిది కార్పొరేషన్లు, 90 మున్సిపాలిటీల్లో ప్రత్యేకాధి కారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. విజయవాడలోని ఓ హోటల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ కమిషనర్ల కార్యశాలకు మంత్రి బొత్స ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

పురపాలక ఎన్నికలు జరిగేవరకు ప్రత్యేకాధికారుల పాలన ఉంటుందని స్పష్టం చేశారు. వార్డు సభ్యుల ఎన్నికకు రిజర్వేషన్లు, విలీన గ్రామాల అంశాలు వంటి కొన్ని అవరోధాలున్నాయని.. సీఎం జగన్ ఆదేశాలకు మేరకు సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని చెప్పారు.

**ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు ఉండవు**

నెలరోజుల క్రితం అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం పూర్తి స్నేహపూర్వకమైనదని.. ఎవరిపైనా వ్యక్తిగతంగా కక్షలు ఉండబోవని బొత్స అన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ కుటుంబంలో సభ్యులేనని.. వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మున్సిపాలిటీలోని అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కమిషనర్లు ముందుకు సాగాలన్నారు. క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు రాకుండా కాగితాల్లో అంతా బాగుందనే భావన తేవొద్దని మంత్రి హితవు పలికారు. త్వరలోనే కమిషనర్ల బదిలీలు జరుగుతాయని.. వారికి కేటాయించిన ప్రాంతానికి వెళ్లి ప్రభుత్వానికి సహకరించాలన్నారు.

# ఉత్సాహంగా సెయిలింగ్ వీక్ పోటీలు ప్రారంభం



హైదరాబాద్: హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో సెయిలింగ్ వీక్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జాతీయ స్థాయిలో జరుగనున్న హైదరాబాద్ 34వ సెయిలింగ్ వీక్ పోటీలను గవర్నర్ నరసింహన్ ప్రారంభించారు. జాతీయ స్థాయిలో జరిగే సెయిలింగ్ పోటీలకు హుస్సేన్‌సాగర్ వేదిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. గత 33ఏళ్లుగా జరుగుతున్న ఈ పోటీల్లో తెలంగాణ నుంచి సెయిలర్స్ ఛాంపియన్‌గా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నేటి నుంచి వారం రోజుల పాటు ఈ సెయిలింగ్ పోటీలు హుస్సేన్‌సాగర్‌లో నగర వాసులకు కనువిందు చేయనున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సైలర్స్ ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చనున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్మీ, నేవీతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com